

నోట్లు.. పంచేయ్..!

పంపకానికి వెనకాడొద్దు.. ప్రత్యర్థి కంటే ఎక్కువే ఇవ్వాలి



ఓటుకు నోటు

ఎన్నికల ప్రక్రియ చివరి దశకు చేరుకుంటోంది. ప్రచార ఘట్టానికి శనివారం సాయంత్రంతో తెరపడనుంది. ఈనేపథ్యంలో చివరిరోజు ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారంలో సభలు, ర్యాలీలతో బలప్రదర్శన చేయనున్నారు. ఓటర్లపై చివరి అస్త్రాన్ని సైతం ప్రయోగిస్తున్నారు. ఓటుకు నోటు పంపిణీకి తెరలేపారు. ఎంత మందు, ఎంత నగదు అనే లెక్కల్లో మునిగి తేలుతున్నారు. ప్రత్యర్థి పార్టీ వారు ఎంత ఇచ్చారు, తామెంత ఇవ్వాలని లెక్కగట్టి పోలింగ్ బూత్‌లవారీగా నగదు, మద్యం పంపిణీ చేయడంపై ప్రధానంగా దృష్టి పెట్టారు. పట్నం, పల్లెలను కరెన్సీ నోట్ల కట్టలు, మద్యం నిషాతో ముంచేస్తున్నారు. ఓటుకు నోటు పంపకాలతో పట్టణాలు, గ్రామాల్లో కరెన్సీ నోట్లు కట్టలు తెంచుకున్నాయి. ఇందులో అధికార పార్టీ ముందు వరుసలో నిలిచి, ఓటర్లకు నగదు వెదజల్లుతోంది.

ఎన్నికల్లో అధికార పార్టీ అడ్డదారులు తొక్కుతోంది. కరెన్సీ నోట్లను వెదజల్లుతోంది. వైసీపీ ఐదేళ్ల పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, ఆగ్రహం నెలకొన్నాయని తెలిసి.. కరెన్సీ నోట్లతో చల్లార్చే కుతంత్రానికి తెరలేపింది. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ సైతం ఎన్నడూలేనంత శాతం నమోదవడం, అది ప్రభుత్వ వ్యతిరేక ఓటేనని గ్రహించిన అధికార పార్టీలో కలవరం రేగింది. ఈ ఎన్నికల్లో ఓటునే నమ్ముకుంది. మూటల కొద్దీ దించి, కట్టలుగా పంచుతోంది. ప్రతిపక్షాల కన్నా అధికంగా పంచాలని అధిష్టానం ఆదేశించినట్లు ఆ పార్టీలో చర్చ సాగుతోంది. దీంతో విచ్చలవిడిగా నోట్లు పంచేస్తున్నారు. జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో చిత్తూరు గ్యాంగ్‌లు వాలిపోయాయి. ఎడాపెడా డబ్బు, మద్యం పంచేస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి
పుట్టపర్తి

- ఏ అవకాశాన్నీ వదలొద్దు..
- ప్రలోభాలకు తెరలేపిన అధికార పార్టీ
- ఓటుకు రూ.2 వేల నుంచి రూ.3 వేలు
- జిల్లాలో వాలిన చిత్తూరు గ్యాంగ్‌లు
- కట్టలు తెంచుకుంటున్న కరెన్సీ నోట్లు
- లేపాక్షిలో నోట్ల మూటలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- నేటితో ప్రచారానికి తెర

నోటుతో కొనే కుట్ర



వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాలో అభివృద్ధి జాడేలేదు. వైసీపీపై అన్నివర్గాలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నాయి. ఆగ్రహంతో కూడా ఉన్నాయి. ఎన్నికల్లో జనం మార్పు కోరుకుంటున్నారు. దీనిని పసిగట్టిన వైసీపీ ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవాలనే ఉద్దేశంతో అడ్డదారులను ఎంచుకుంటోంది. ఓటు విలువ రూ.2 నుంచి రూ.3వేల దాకా నిర్ణయించింది. వైసీపీ పాలనలో భారీ ప్రాజెక్టులు, ఇతర మార్గాల్లో లబ్ధిపొందిన కాంట్రాక్టర్లు రంగంలోకి దిగారు. ఎక్కడికక్కడ గ్రామాల్లోకి మనుషులను దింపేసి, పంపకాలు చేపట్టారు. ఇటీవల పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ సమయంలో ఉద్యోగుల ఓట్లకు నోటు ఎరచూపినా అధికార పక్షానికి షాక్ తప్పలేదు. దీంతో అధికార వైసీపీ సాధారణ ఓటర్లపై గురిపెట్టింది. ఒక్కో నియోజకవర్గానికి రూ.50 కోట్లుపైగా పంచేలా నిర్ణయించింది. అధికార పార్టీ గురువారం నుంచే పంపకాల పర్వానికి తెరలేపింది.

నోట్ల కట్టలు వచ్చేశాయ్..

ఓటర్లను ప్రలోభపెట్టడంలో భాగంగా నోట్ల కట్టలను దించేశారు. శుక్రవారం ఓ వైసీపీ అభ్యర్థికి చెందిన నోట్ల కట్టలు కర్ణాటక నుంచి కొడికొండ చెక్‌పోస్టు మీదుగా కారులో తీసుకొస్తుండగా.. లేపాక్షి ఇందిరమ్మ కాలనీ వద్ద పోలీసు తనిఖీలు చేస్తుండడాన్ని చూసి, వెనక్కి మళ్లించి, ఓ ఇంటి వద్ద నాలుగు సంచుల్లో దించేసి, ఖాళీ కారు వెళ్లినట్లు తెలిసింది. విషయం వైసీపీ స్థానిక నాయకులకు తెలియడంతో ఆ డబ్బు సంచులను తీసుకెళ్లారు. సంచుల్లోని కొంత నగదు మాయమవడంతో ఆనోటా.. ఈనోటా.. పడి అధికారులకు తెలియడంతో శనివారం ఇందిరమ్మ కాలనీ వద్ద విచారణ చేపట్టారు. దీనిని బట్టి చూస్తే కరెన్సీ నోట్లను అధికార పార్టీ ఏ మేరకు వెదజల్లుతోందో అర్థం చేసుకోవచ్చు. ఇలా అన్ని నియోజకవర్గాల్లో పంపకాలు మొదలు పెట్టారు. పుట్టపర్తి, ధర్మవరం, పెనుకొండ మినహా మడకశిర, హిందూపురం, కదిరి నియోజకవర్గాల బాధ్యతలను ఇతర జిల్లా నేతలకు అప్పగించినట్లు సమాచారం. ఆ మూడు నియోజకవర్గాల్లో డబ్బు, మద్యం పంపిణీ బాధ్యతను చిత్తూరు జిల్లాకు చెందిన మంత్రి పెద్దిరెడ్డికి అప్పగించగా.. ఆయన అనుచరులు వచ్చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఓటుకు రూ.2 వేల నుంచి రూ.3 వేలు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రత్యర్థి ఇచ్చే దానికన్నా రూ.500 ఎక్కువగా పంచాలన్నది పైనుంచి ఆదేశం. ఇందుకోసం చిత్తూరు నుంచి ప్రత్యేక బృందాలు దిగిపోయాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క అభివృద్ధి పని చేపట్టింది లేదు, ఒక్క పరిశ్రమ వచ్చింది లేదు. దీంతో నిరుద్యోగం పెరిగిపోయింది. అన్ని రంగాల్లో అభివృద్ధి పడకేసి, రాష్ట్రం 20 ఏళ్ల వెనక్కిపోయింది. అన్నివర్గాల ప్రజలు.. అధికార పక్షంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. దీనిని గుర్తించి, వైసీపీ ఆఖరి అస్త్రంగా డబ్బు వెదజల్లాలని నిర్ణయించుకుంది. ఇప్పటికే ఉద్యోగవర్గాల ఓట్ల కొనుగోలుకు ఒక్కొక్కరికి రూ.5 వేలు ఎరచూపినా ఫలితం కనిపించట్లేదు. హిందూపురం, మడకశిరలో చిత్తూరు పంపకాల గ్యాంగులు వాలిపోయాయి. పెనుకొండ, ధర్మవరం, పుట్టపర్తిలో పోలింగ్ బూత్‌ల వారీగా లెక్కగట్టి, పంపిణీ చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గానికి ఓటర్లను లెక్కగట్టి, నోట్ల కట్టలు సిద్ధం చేస్తున్నారు. అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న నారా రోహిత్

జగన్ పాలన అంతా

కక్ష సాధింపులే

కూటమి అభ్యర్థుల విజయంతోనే రాష్ట్రాభివృద్ధి
సినీహీరో నారా రోహిత్

కొత్తచెరువు, మే 10: జగన్ ఐదేళ్ల పాలన అంతా కక్ష సాధింపులతోనే సాగిందని సినీహీరో నారా రోహిత్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మాజీ జడ్పీటీసీ లక్ష్మీనారాయణ ఇంట్లో నారా రోహిత్ శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. జగన్ రాష్ట్రంలోని ప్రకృతి సంపదను విచ్చలవిడిగా దోచేశారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఐటీ పరిశ్రమలు రాకుండా చేశారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి మచ్చుకు కూడా లేదని మండిపడ్డారు. మద్యపాన నిషేధం అమలు చేస్తానన్న పెద్దమనిషి రకరకాల మద్యం బ్రాండ్లతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ కార్పొరేషన్లకు నిధులివ్వకుండా కాలయాపన చేశారన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడన్నారు. ఈ పరిస్థితుల్లో చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. అభివృద్ధి చేసే వారికే ప్రజలు పట్టం కట్టాలని కోరారు. సమావేశంలో పుట్టపర్తి నియోజకవర్గ పరిశీలకుడు మూర్తి, నాయకులు పాల్గొన్నారు.

ఎన్ని సిత్రాలో...


ఆకుకూరలు కొనుగోలు చేస్తున్న వసుంధరదేవి

హిందూపురం, మే 10: తెలుగుదేశం పార్టీ తరపున మూడోసారి బరిలో ఉన్న ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరాదేవి పోలింగ్ దగ్గర పడుతున్న కొద్దీ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఉదయం లేచింది మొదలు రాత్రి వరకు ప్రచారంలో నిమగ్నమవుతున్నారు. శుక్రవారం వినూత్న ప్రచారం చేపట్టారు. పట్టణంలోని పీడీ రోడ్డులో ఉదయం వందలాది మంది అల్పాహారం కోసం ఉంటారు. దీంతో ఉదయం 9 గంటల వరకు పీడీ రోడ్డులో అల్పాహారం కోసం వేచివున్న వారిని ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా హోటల్‌లో దోసె పోశారు. దుకాణంలో సరుకులు తూకం వేసి, అందించారు. హిందూపురం నుంచి లేపాక్షికి వెళ్లే దారిలో 2కి.మీ. ఆర్టీసీ బస్సులో వెళ్తూ ప్రయాణికులను ఓటు అడిగారు. మహిళా కండక్టరుతోపాటు ప్రయాణికులు.. ఆమెతో సెల్ఫీల కోసం ఎగబడ్డారు. వసుంధరాదేవి మాట్లాడుతూ.. హిందూపురంలో వ్యాపారాలు బాగా సాగాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పిస్తారని తెలియజేశారు. సూపర్ సిక్స్, ఉమ్మడి మేనిఫెస్టోలో పొందుపరచిన హామీలను ఓటర్లకు తెలిపారు. కూరగాయలు, పండ్లు అమ్మేవారి వద్దకెళ్లి ఆప్యాయంగా పలకించారు. ఓటు అభ్యర్థించారు. వసుంధరాదేవి ఆప్యాయంగా మాట్లాడడంతో వారంతా ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.

వైసీపీ మూకల దాష్టీకం


దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్త సోమశేఖర్ దంపతులు

ఓటెందుకు వేయాలన్నందుకు టీడీపీ కార్యకర్తపై దాడి..

అడ్డుకోబోయిన భార్యపై కూడా..

తాడిమర్రి, మే 10: మండలంలోని పిన్నదరి గ్రామంలో వైసీపీ నాయకులు దాష్టీకం ప్రదర్శించారు. తమకేం చేశారని ఓటేయాలని నిలదీసినందుకు గ్రామానికి చెందిన వడ్డె సోమశేఖర్‌పై శుక్రవారం రాత్రి దాడి చేశారు. అడ్డుకోబోయిన అతడి భార్యపైనా దాడి చేశారు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పిన్నదరికి చెందిన వైసీపీ నాయకులు బాలకృష్ణారెడ్డి, సోమిరెడ్డి, రామాంజనేయరెడ్డి, షెక్షావలి మరికొంతమంది శుక్రవారం రాత్రి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వడ్డె సోమశేఖర్ ఇంటి వద్దకెళ్లి వైసీపీకి ఓటు వేయాలని కోరారు. 'మాకేం చేశారు? మీకెందుకు ఓటు వేయాలని?' సోమశేఖర్ ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహానికి లోనైన వైసీపీ నాయకులు.. సోమశేఖర్‌పై దాడి చేశారు. అడ్డుకోబోయిన అతడిపై భార్య సునీతపై కూడా దాడి చేశారు. చిన్నపిల్లలున్నారనీ, వదిలిపెట్టాలని వేడుకున్నా.. వదలకుండా కొట్టారని ఆమె వాపోయింది. దీనిపై బాధితులు.. టీడీపీ నాయకులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఎస్ఐ నాగాస్వామి కేసు నమోదు చేసుకున్నారు.



ప్రాంతం	పుట్టపర్తి	కదిరి	ధర్మవరం	హిందూపురం	పెనుకొండ
గరిష్ఠం కనిష్ఠం	37.0 26.0	36.0 26.0	37.0 27.0	36.0 24.0	36.0 24.0

5 ఏళ్లూ అంధకారం..!

వైసీపీ ఐదేళ్ల పాలన మొత్తం అంధకారమే. కదిరి నియోజకవర్గంలో అభివృద్ధి అటకెక్కింది. కొత్త పనులు చేపట్టింది లేదు. టీడీపీ హయాంలో ప్రారంభించిన వాటిని కూడా పూర్తిచేయలేకపోయారు. నిధులలేమితో అభివృద్ధి చాలావరకు పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. కొన్నింటికి వైసీపీ నాయకులే మోకాలడ్డారు. టీడీపీ హయాంలో బైపాస్‌రోడ్డు, టిడ్కోఇళ్లు, మైనార్టీ విద్యాసంస్థలు, ఈపీపీ రోడ్లు తదితరాల నిర్మాణానికి శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించారు. తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ ఐదేళ్లయినా వాటిని పూర్తి చేయలేకపోయింది. కొన్ని అడుగు కూడా ముందుకుపడలేదు. దీంతో కొన్ని శిథిలావస్థకు చేరాయి. ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం, బైపాస్‌రోడ్డు అర్ధంతరంగా ఆగిపోయాయి.

\- కదిరి


అర్ధంతరంగా ఆగిన బైపాస్‌రోడ్డు నిర్మాణం

- వైసీపీ పాలనలో అటకెక్కిన అభివృద్ధి
- కదిరి నియోజకవర్గంలో ఎక్కడి పనులు అక్కడే..
- ఒక్కటీ పూర్తి చేయని వైనం
- నిధులివ్వలేని దుస్థితిలో ప్రభుత్వం
- బైపాస్‌రోడ్డుకు వైసీపీ నాయకుడే అడ్డు
- అర్ధంతరంగా ఆగిన ఆస్పత్రి భవనం

ముందుకు కదలని బైపాస్‌రోడ్డు నిర్మాణం

కదిరికి రింగ్‌రోడ్డు కావాలని అప్పట్లో వైసీపీ నాయకులు.. టీడీపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు నెలల్లోపే రింగ్‌రోడ్డు పూర్తి చేస్తామని ప్రగల్భాలు పలికారు. టీడీపీ హయాంలో శంకుస్థాపన చేసి, బైపాస్‌రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఆ తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ ఐదేళ్లయినా పనులను పూర్తిచేయలేకపోయింది. పులవెందుల రోడ్డునుంచి అనంతపురం, హిందూపురం రోడ్లను కలుపుతూ మదనపల్లి రోడ్డు వరకు పనులు ప్రారంభించారు. 12 కిలోమీటర్ల మేర రోడ్డు ఉంది. కేంద్రం నిధులు ఇచ్చినా భూసేకరణ పూర్తి చేయలేక బైపాస్‌రోడ్డు నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయింది. కుటాగుళ్ల వద్ద కొంతమంది రైతులకు సరైన ధర చెల్లించకపోవడంతో వారు కోర్టుకెళ్లారు. మదనపల్లి రోడ్డు నుంచి హిందూపురం రోడ్డుకు వెళ్లే బైపాస్‌లో కూడా కొంతమేర భూసేకరణ మిగిలి ఉంది. ఇది ఓ వైసీపీ నాయకుడిదిగా చెబుతున్నారు. గతంలో బైపాస్ రోడ్డు పూర్తి చేయాలని డిమాండ్ చేసిన వైసీపీ నాయకులే సరైన పరిహారం ప్రకటించలేదని కోర్టుకెళ్లినట్లు తెలిసింది. వైసీపీ నాయకుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు.


అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లు

పూర్తికాని టిడ్కో ఇళ్లు

పట్టణ పేదల సొంతింటి కల సాకారం చేయడానికి టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. గట్లు వద్ద మొదటి విడతలో 1100 ఇళ్లను జీప్లస్ 3గా నిర్మించారు. 80 శాతం పనులు కూడా పూర్తయ్యాయి. మిగిలిన 20శాతం పనులు వైసీపీ ఐదేళ్లలో పూర్తి చేయలేకపోయింది. అలా పేదల సొంతింటి కలపై నీళ్లు చల్లారు. వైసీపీ నిర్వాకంతో పేదలు అద్దె ఇళ్లలో మగ్గుతున్నారు.

శిథిలావస్థకు మైనార్టీ విద్యాసంస్థల భవనాలు

మైనార్టీ విద్యార్థుల కోసం టీడీపీ దాదాపు రూ.30 కోట్ల వ్యయంతో పట్టణం సమీపంలో పాలిటెక్నిక్, గురుకుల పాఠశాలలు, వసతిగృహాల నిర్మాణం చేపట్టింది. టీడీపీ హయాంలో చేసిన పనులు తప్ప.. వైసీపీ ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకేయలేదు. దీంతో అవి దాదాపు శిథిలావస్థకు చేరాయి. మొండిగోడలు దర్శనమిస్తున్నాయి. అవి పూర్తి చేసి ఉండుంటే కదిరిలో అత్యధికంగా ఉన్న మైనార్టీ విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేది. మైనార్టీ విద్యార్థుల భవిష్యత్తును వైసీపీ అంధకారంలో పడేసింది.

ఆస్పత్రి నిర్మాణం పూర్తయ్యేదెన్నడో?

పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రూ.18కోట్లతో మూడేళ్ల క్రితం భవన నిర్మాణం చేపట్టారు. స్థలం లేకపోవడంతో ఆస్పత్రి పాత భవనాలను తొలగించారు. అందులో నిర్వహిస్తున్న బ్లాడ్‌బ్యాంకు, ఎక్స్‌రే యూనిట్లను మరోచోటికి తరలించారు. అవి మరింత ఇరుకుగా ఉండడంతో రోగులు తీవ్ర అసౌకర్యానికి లోనవుతూ అనారోగ్యం బారిన పడుతున్నారు. మూడేళ్లయినా ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తికాలేదు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ భవనం పూర్తయి ఉండుంటే కొన్ని అత్యాధునిక సౌకర్యాలు కదిరి ప్రజలకు అందుబాటులోకి వచ్చేవి. వాటిని పూర్తి చేయడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం చేసింది. కదిరి అభివృద్ధిని వైసీపీ పాలకులు గాలికొదిలేశారు. ఎమ్మెల్యేగా సిద్దారెడ్డిని గెలిపిస్తే ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేకపోయారని నియోజకవర్గ ప్రజలు మండిపడుతున్నారు.



కదిరిని అన్నింటా అభివృద్ధి చేస్తా

కదిరి ప్రజల కష్టాలు, కన్నీళ్లు చూశాననీ, వాటిని బాపడమే తన లక్ష్యమని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. 20 ఏళ్ల రాజకీయ అనుభవంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలనన్నారు. సేవా కార్యక్రమాలు చేశానన్నారు. టీడీపీ తరఫున నాలుగోసారి ఎన్నికల బరిలో నిలిచాననీ, విజయం తనదేనని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారం చేపట్టడం తథ్యమన్నారు. అనంతరం నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. కదిరిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ముందున్న లక్ష్యమన్నారు. రాష్ట్రంలోనే అభివృద్ధి పరంగా మోడల్‌గా నిలుపుతానన్నారు. ఈ మేరకు ఆయన 'ఆంధ్రజ్యోతి'కి శుక్రవారం ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

\- కదిరి

రాష్ట్రానికే మోడల్ చేస్తా
హంద్రీనీవాతో అన్ని చెరువులు నింపుతా
మున్సిపాలిటీలో అండర్‌గ్రౌండ్ డ్రేనేజీ ఏర్పాటు చేయిస్తా
రింగ్‌రోడ్డు నిర్మిస్తా
టమోటా రైతును ఆదుకుంటా
పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తా
ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తా
కూటమి కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్
'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: ప్రచారం ఎలా సాగుతోంది?
కందికుంట: నియోజకవర్గంలో 60 రోజులపాటు ప్రచారం చేశాం. అన్ని గ్రామాలు, వార్డుల్లో ప్రజలు హారతులతో స్వాగతం పలికారు. వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత ప్రచారంలో స్పష్టంగా కనిపించింది. నేను 20 ఏళ్లలో ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేసుకుని మరీ ఆదరిస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం కోసం అన్నివర్గాలు ఎదురు చూస్తున్నాయి. ప్రజలే స్వచ్ఛందంగా వచ్చి తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి, ప్రభుత్వాన్ని తెచ్చుకుంటామని చెబుతున్నారు.

ఆంధ్రజ్యోతి: ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి పరిస్థితి ఏంటి?
కందికుంట: ప్రస్తుత ఎన్నికల్లో వైసీపీకి స్థానికంగా అభ్యర్థి దొరక్క, బెంగళూరులో వ్యాపారం చేసుకుంటున్న వ్యక్తిని బరిలో నిలిపింది. ఆయనకు నియోజవర్గంపైగానీ, ప్రజలపైగానీ, వారి కష్టనష్టాలపైగానీ ఎటువంటి అవగాహన లేదు. వైసీపీకి ఆదరణ లేదని తెలిసి ప్రశాంతంగా ఉన్న కదిరిలో మతవిద్వేషాలు రెచ్చడానికి ప్రయత్నిస్తున్నాడు. మతం పేరుతో రాజకీయాల్లో లబ్ధి పొందాలని చూస్తున్నాడు. కదిరి ప్రజలు తెలివైన వారు. ఎవరు, ఎన్ని రకాలుగా రెచ్చగొట్టినా అభివృద్ధి చేసే నాయకులు, పార్టీనే ఆదరిస్తారు. నిత్యం వారితో ఉండే నాయకులను తప్ప.. ఎన్నికల ముందు బ్యాగులతో వచ్చే వారిని ఆదరించిన దాఖాలాల్లేవు. వైసీపీ అభ్యర్థి గురించి పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు.

ఆంధ్రజ్యోతి : 20 ఏళ్ల రాజకీయ జీవితం ఎలా సాగింది?
కందికుంట: 2003లో రాజకీయ జీవితాన్ని టీడీపీలో ప్రారంభించా. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశా. 2009లో టీడీపీ టిక్కెట్‌పై పోటీ చేసి, గెలుపొందా. నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టా. 2014, 2019 ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేశా. ప్రస్తుతం కూడా బరిలో ఉన్నా. 20 ఏళ్లలో కదిరి నియోజకవర్గ ప్రజల కష్టాలు, బాధలు చూశా. నియోజకర్గంలోని అన్ని సమస్యలపై పూర్తి అవగాహన ఉంది. ఈ ఎన్నికల్లో గెలుపొంది, వాటన్నింటినీ పరిష్కరిస్తా. హంద్రీనీవా జలాలతో అన్ని చెరువులు నింపుతా. పెద్దఎత్తున పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తా. మౌలిక వసతులు కల్పిస్తా.

ఆంధ్రజ్యోతి: మీరు గెలిస్తే కదిరి ప్రాంతాన్ని ఎలా అభివృద్ధి చేస్తారు?
కందికుంట: నేను ఎమ్మెల్యేగా గెలవడం ఖాయం. నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్‌గా అభివృద్ధి చేస్తా. హంద్రీనీవా ప్రధాన కాలువ నిర్మాణం పూర్తి చేస్తా. తద్వారా కృష్ణాజలాలు తీసుకొచ్చి, నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరిస్తాం. వ్యవసాయాన్ని లాభసాటిగా చేస్తా. పరిశ్రమలు ఏర్పాటు చేసి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తా. గెలిచిన తొలి ఏడాదిలోనే ఎస్టీ, ఎస్సీ కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తా. కదిరిలో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేస్తా. రింగ్‌రోడ్డును నిర్మిస్తా. జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేస్తా. కదిరి పట్టణానికి తాగునీటి అవసరాలకోసం చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి పైపులైన్ వేసి, సరఫరా చేస్తా. తద్వారా మున్సిపాలిటీపై విద్యుత్ భారం తగ్గుతుంది. యువగళంలో నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం కేంద్రంగా టెంపుల్‌సర్క్యూట్ ఏర్పాటు చేస్తాం. తద్వారా ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుంది. అర్ధంతరంగా ఆగిపోయిన మైనార్టీ హాస్టళ్లు, టిడ్కో భవనాలు, హంద్రీనీవా ప్రధాన కాలువ, నంబులపూలకుంట-కదిరి రహదారి నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తా.

ఆంధ్రజ్యోతి: మైనార్టీల సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు?
కందికుంట: పట్టణంలో ముస్లిం మైనార్టీలు అత్యధికంగా ఉన్నారు. వారికోసం ఇప్పటికే సొంత ఖర్చుతో షాదీమహల్‌కు మరమ్మతులు చేయించా. ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటుకు కృషి చేస్తా. మైనార్టీ విద్యాసంస్థల భవన నిర్మాణాలు పూర్తి చేస్తా. మైనార్టీల సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటా. ప్రభుత్వం.. మైనార్టీలకు అమలుచేసే అన్ని పథకాలను కదిరి వాసులకు వర్తింపజేయడంలో చొరవ చూపుతా. ఇమామ్, మౌజన్లకు ప్రత్యేకంగా ఇళ్లు నిర్మించి, రాష్ట్రంలోనే నూతన ఒరవడికి శ్రీకారం చుడతా. బీడీ కార్మికుల కోసం ప్రత్యేకంగా ఉన్న పథకాలు అమలయ్యేలా చర్యలు తీసుకుంటా.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

హిందూపురం, మడకశిర, పెనుకొండ	:9985445760
ధర్మవరం, పుట్టపర్తి	: 9963160529
కదిరి	:9052518170

ఏసీఎం: 9985411154

వదల బొమ్మాళీ వదల..!



తాము రాజీనామా చేసినా తమ పరిధిలోని ఓటర్లను మాత్రం వలంటీర్లు వదలడం లేదు. అధికార పార్టీకి సాయంగా గుట్టు చప్పుడు కాకుండా ప్రలోభ పెడుతూనే ఉన్నారు. రాజీనామా చేసిన వలంటీర్లకు ఆయా నియోజక వర్గ అధికార పార్టీ అభ్యర్థులు వేతనాలు ఇచ్చి ఈ పనులకు పురమాయిస్తున్న ట్లు తెలిసింది. ఈనేపథ్యంలోనే వలంటీర్లు ఓటర్లను ప్రలోభపెట్టే కార్యక్రమానికి తెర తీశారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. అనంతపురం అర్బన్ వైసీపీ అభ్యర్థి తమ పరిధిలోని వలంటీర్ల ద్వారా ఓటర్లకు నగదు పంపిణీ చేపట్టారనే ఆరోపణ లు వినిపిస్తున్నాయి. ఇప్పటికే చాలా వరకు నగదు పంపిణీ చేశారని తెలుస్తోంది. కొందరు వలంటీర్లు నగదు పంపిణీకి అంగీకరించకపోవడంతో ఆయా ప్రాంతాల వైసీపీ వర్గీయులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇదంతా గుట్టుచప్పుడు కాకుండా ఓట్ల కోసం వైసీపీ సాగిస్తున్న అక్రమ వ్యవహారమనే చర్చ నగరంలో సాగుతోంది.

- అనంతపురం సిటీ

ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయండి



అనంతపురం టౌన్, మే 10: ఎన్నికలకు సంబంధించి ఎక్కడ ఎలాంటి అక్రమాలు, సంఘటనలు జరిగినా.. సమస్యలు ఏర్పడినా ఫిర్యాదు చేయడానికి జిల్లా స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదులు చేయడానికి టోల్ ఫ్రీ నెంబర్లు కేటాయించారు. 08554-231722, 08554-232922, 08554-231922, 18004258802, 18004258803, 188004258804 ఈ నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయవచ్చు. ఫిర్యాదులపై 100 నిమిషాలలోనే అధికారులు స్పందించి వాటిపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటారు. **పరిశీలకులకు కూడా..** ఎన్నికల పరిశీలన కోసం జిల్లాకు కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రత్యేక పరిశీలకులను పంపించింది. ఎక్కడైనా ఇబ్బందులు, సమస్యలు ఏర్పడితే వీరికి కూడా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు. అనంతపురం పార్లమెంటు ఎన్నికల జనరల్ అబ్జర్వర్లు.. అజయ్‌నాథ్ (8919756419), రవికుమార్ (8247810416), వ్యయ పరిశీలకులు విలాస్ వి.షిండే (9408794122), రాయదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు నితిన్ అగర్వాల్ (8247832873), అనంతపురం, రాప్తాడు, కళ్యాణదుర్గం, శింగనమల నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు రాందాస్ టి.కాలే (8074550860) ఈనెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. సీవిజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు.

ఓటెయ్యాలా.. డ్యూటీ చేయాలా..?



ఎన్నికల వేళ పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేయనున్న ప్రథమ చికిత్స కేంద్రంలో విధులు కేటాయించడంతో తామెలా ఓటు హక్కు వినియోగించుకోవాలని పలువురు వైద్యసిబ్బంది ప్రశ్నిస్తున్నా రు. జిల్లాలో 2,236 పోలింగ్ కేంద్రాలు ఉండగా ప్రతి కేంద్రానికి ఒక నర్సు, ఒక ఆశా కార్యకర్తను నియమించారు. వీరి పర్యవేక్షణకు డాక్టర్లను ఏర్పాటు చేశారు. ఈలెక్కన దాదాపు ఐదువేల మంది వైద్య సిబ్బంది ఎన్నికల డ్యూటీలో ఉండనున్నారు. ఇప్పుడు ఇదే సమస్యగా మారింది. ఎన్నికల కేంద్రాల వద్ద డ్యూటీ ఉంటే ఓటు మరో చోట ఉన్న వాళ్లు ఎలా ఓటు హక్కు వినియోగించుకుంటారనే చర్చ నడుస్తోంది. గతంలో ఇలా డ్యూటీలకు వెళ్లే వైద్య సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించేవారు. ఈసారి అలాచేయకుండా డ్యూటీలు వేసేయడంతో అయోమయం నెల కొంది. దీనిపై డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ.బీ.దేవిని అడిగితే ఓటు ఎక్కడ ఉంటే అక్కడే వారికి డ్యూటీ వేస్తున్నామని, ఒకవేళ ఓటు మరోచోట ఉన్నా అలాంటి వారిని పంపించి ఓటు వేసి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ఇప్పటికే డాక్టర్లకు ఈమేరకు ఆదేశాలు కూడా ఇచ్చినట్లు తెలిపారు.

- అనంతపురం టౌన్

ఏలికా.. మీ మాట మరువలేం


- చెత్తా చెదారంతో నిండిన మరువవంక



చెత్తతో నిండిన మరువవంక

అనంతపురం సిటీ: నగరంలోని మరువవంకలో చెత్తా చెదారం నిండిపోవడంతో డ్రైనేజీ నీరు ముందుకుసాగడం లేదు. ప్రధానంగా ఐరన్‌బ్రిడ్జి, సూర్యనగర్ వెంబడి ఉన్న మరువవంకలో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు, కుప్పలుగా పడింది. దీంతో మురుగు నీరు ముందుకు కదలడం లేదు. వర్షం వచ్చిన సమయంలో మరింత ఇబ్బందికరంగా మారుతోంది. బయటినుంచి డ్రైనేజీ, వర్షపు నీరు సైతం ఆ కాలువలోకి రాకుండా చెత్తచెదారం అడ్డుగా ఉండటంతో మురుగునీరు రోడ్లపైకి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. నిత్యం దుర్వాసన వస్తుండటంతో మరువవంకకాలువ సమీపంలో నివాసం ఉండే ప్రజలు పరిస్థితి దారుణంగా మారింది. గత ఎన్నికల సందర్భంగా నగరంలో అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన ప్రస్తుత ఎమ్మెల్యే గెలిచాక అటువైపు ఆలోచనే చేయడం లేదని నగర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరువవంక సమీపంలోని ప్రజలను కదిలిస్తే తమను మురుగు దుర్గంధానికి వదిలేసిన నాయకులకు 13న జరిగే ఎన్నికల్లో ఓటుతో తగిన బుద్ధి చెబుతామని పేర్కొంటున్నారు.

జగన్ మార్కు అభివృద్ధి ఇదే..!




రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

అనంతపురం సెంట్రల్, మే 10: అభివృద్ధి అంటే ఏమిటో తమ ప్రభుత్వాన్ని చూసి నేర్చుకోవాలని సీఎం జగన్ తరచూ చెప్పే మాటలు వాస్తవ విరుద్ధంగా ఉన్నాయి. క్షేత్రస్థాయిలో రోడ్లు సరిగాలేవు. మురుగు కాలువలు అసలే లేవు. దీంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. బళ్లారి బైపాస్ ఎంవైఆర్ కల్యాణమండపం నుంచి నగరం వైపు కిలోమీటరు దూరం వరకు ఏళ్లతరబడి మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. ఆ పరిసర ప్రాంతంలో అనేక రంగాల కార్మికులు, దుకాణాదారులు, వ్యాపారులు ఉన్నారు. ఇది బళ్లారి, హోస్పేట్, హుబ్లీ, గోవాకు ప్రధాన రహదారి కావడంతో నిత్యం వేలాది వాహనదారులు ఈ మురుగును దాటుకుని వెళ్తుంటారు. సంవత్సరాలు గడిచినా కాలువను మరమ్మతు చేయకుండా మురుగును రోడ్డుపై వదిలేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేనా కళ్లముందు కనిపించే అభివృద్ధి జగన్ అంటూ ఎద్దేవా చేస్తున్నారు.

ఐదేళ్లూ.. పస్తులే..!

పట్టెడన్నమూ కరువేనా జగన్ మామయ్యా..?
ఇంటర్ విద్యార్థుల ఆకలి బాధలు
నాడు కడుపు నింపిన చంద్రబాబు
జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు
ఉద్యమించిన నేతలపైనా కేసులు





అనంతపురం విద్య: విద్యార్థులకు మామయ్యను అని చెప్పుకునే జగన్‌రెడ్డి.. ఈ ఐదేళ్లలో ఇంటర్ విద్యార్థులకు నాలుగు మెతుకులు కూడా అందించలేకపోయారు. మీ మామయ్యను అంటూ చెప్పుకుని...పిల్లల తల్లిదండ్రులలో ఓట్లు వేయించుకుని 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్.. ఇంటర్ పిల్లలు కాలే కడుపులతోనే చదువుకునేలా చేశారు. పల్లెల నుంచి పట్టణాల్లోని జూనియర్ కళాశాలలకు ఆకలి కడుపులతో వచ్చి చదువుకుంటున్నారన్న విషయం తెలుసుకున్న నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2018, 2019లో ఇంటర్ విద్యార్థులకు సైతం మధ్యాహ్న భోజనం అందించారు. వేలాది మంది ఇంటర్ విద్యార్థుల కడుపు నింపారు. 2019లో సీఎం పీఠంపై కూర్చొన్న జగన్.. నిర్దాక్షిణ్యంగా ఇంటర్ పిల్లల కడుపుపై కొట్టారు.

టీడీపీ హయాంలో మధ్యాహ్న భోజనం

విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా గత ప్రభుత్వం నడిచింది. ముఖ్యంగా ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా భోజనం అందించాలన్న సంకల్పంతో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు తీసుకున్నారు. 2018, 2019 సంవత్సరాల్లో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించారు. పాఠశాల విద్యార్థులే కాకుండా ఇంటర్ చదువుకునే విద్యార్థులు సైతం కడుపు నిండా భోజనం చేయాలన్న సదుద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 42 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 18,061 మంది విద్యార్థులకు నిత్యం మధ్యాహ్న భోజనం అందించేవారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు స్కూళ్లలో మధ్యాహ్న భోజనం తయా రు చేయించి, జూనియర్ కళాశాలలకు తెప్పించి పిల్లలకు కడుపు నింపారు. పల్లెటూరి నుంచి పట్టణాల్లోని జూనియర్ కళాశాలలకు వచ్చే విద్యార్థులకు ఇది ఎంతో దోహదపడింది.

విద్యార్థుల కడుపు మాడ్చిన మామయ్య

2019లో అధికారంలో వచ్చిన జగన్ ఇంటర్ విద్యార్థులను గాలికి వదిలేశారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నభోజనం పెడితే...తాను ఎందుకు పెట్టాలన్నట్టుగా వ్యవహరించిన జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని ఆపేశారు. ఇంటర్ విద్యార్థులకు ఏనాడూ భోజనం పెట్టలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 42 జూనియర్ కళాశాలల్లో ఏకంగా లక్ష మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం అందకుండా కోల్పోయారు. పట్టణాలకు వస్తున్న వేలాది మంది ఇంటర్ విద్యార్థులు కాలే కడుపులతోనే చదువుకోవాల్సిన దుస్థితికి తీసుకొచ్చారు. విద్యార్థుల కడుపు మాడ్చవద్దని, మధ్యాహ్న భోజన పథకం ఇంటర్ కళాశాలల్లో సైతం అమలు చేయాలంటూ టీఎన్ఎస్ఎఫ్ ఇతర విద్యార్థి సంఘాల నాయకులు ఉద్యమించారు. విద్యార్థుల తరపున ఆర్ఐఓ ఆఫీస్ వద్ద పోరాటం చేసిన నేరానికి, విద్యార్థి సంఘాల నాయకులపై అక్రమ కేసులు పెట్టారు. పిల్లలకు భోజనం పెట్టాలని ధర్నా చేశారని అధికార మదంతో సుమారు 12 మందిపై అక్రమ కేసులు కూడా పెట్టించడంపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇంటర్ పిల్లల పాలిట కంసమామ



జగన్‌రెడ్డి గత ఎన్నికల్లో విద్యార్థుల పేరు చెప్పుకుని వారి తల్లిదండ్రుల ఓట్లు దండుకున్నాడు. అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం కూడా పెట్టకుండా చేశాడు. మామయ్యను అంటూనే...ఆ విద్యార్థుల పాలిట కంస మామగా మారాడు. ఇంటర్‌లో మధ్యాహ్నభోజనం అమలు చేయాలని విద్యార్థి సంఘాల నేతలుగా ఆందోళనలు చేపడితే మాపై కేసులు కూడా పెట్టాడు. దాదాపు నాలుగేళ్ల కోర్టుల చుట్టూ తిప్పాడు. పేద విద్యార్థుల కడుపు మాడ్చిన జగన్‌కు ఈ ఎన్నికల్లో పతనం తప్పదు.

- బండి పరశురాం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీఎన్ఎస్ఎఫ్

ఇంటర్ విద్యార్థుల పొట్టకొట్టారు



గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు కోసం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక చర్యలు తీసుకున్నారు. పల్లెల నుంచి వచ్చే విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజనం అందించారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ఈ ఐదేళ్లలో విద్యార్థులకు తీరని అన్యాయం చేశారు. లక్షలాది మంది విద్యార్థుల కడుపు మాడ్చారు. కార్పొరేట్ వ్యవస్థకు కొమ్ముకాస్తూ పేద విద్యార్థుల కడుపుకొట్టారు. జగన్ ప్రభుత్వానికి తల్లిదండ్రుల చేతిలో ఓటమి ఖాయం.

- లక్ష్మీ నరసింహ, తెలుగుయువత రాష్ట్ర అధికారి ప్రతినిధి

దళితులపై తోపుదుర్తి అరాచకం



దాడిలో గాయపడిన వన్నూరప్ప (ఫైల్)

● దాడులతో భయాందోళన ● బి.యాలేరులో 270 మంది పట్టాల రద్దు

ఆత్మకూరు, మే 10 : వైసీపీ నేతలు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై వివక్ష చూపడమే కాదు.. ఎక్కడ చూసినా దాడులకు పాల్పడుతూ భయాందోళనకు గురి చేస్తున్నారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరులు, అనుచరులు దాడులు చేస్తూ ఆ వర్గాలను భయభ్రాంతులుకు గురిచేస్తున్నారు. ప్రతిపక్షనాయకులపైనే కాకుండా సొంత పార్టీ నాయకులపైనా దాడులు చేశారు. దీంతో టీడీపీలోకి వలసలు జోరందుకున్నాయి.ఆత్మకూరు మండల వ్యాప్తంగా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీలపై పలుమార్లు దాడులకు తెగబడ్డారు. బి.యాలేరు గ్రామంలో పట్టాలు పంపిణీలో దళితులకు అన్యాయం జరిగింది. 2019లో అప్పటి మంత్రి పరిటాల సునీత 270 మందికి ఇంటి పట్టాలు అందజేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దళిత లబ్ధిదారులకు ఎలాంటి నోటీలు ఇవ్వకుండా పట్టాలు రద్దు చేయించారు. దళితులను పక్కన పెట్టి సొంత సామాజిక వర్గంతో పాటు మరికొందరకి పట్టాలు ఇచ్చారు. పట్టాల పంపిణీ సందర్భంగా దళితులను నుంచి నిరసనలు తలెత్తకుండా ముందస్తు అరెస్టులు చేశారు. బి. యాలేరు దళితులు పట్టాలు పంపిణీ చేయాలని కోర్టుకు వెళ్లడంతో పాటు జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేకుండా పోయింది.

తోపుదుర్తిలో దళితులపై అరాచకం

తోపుదుర్తి గ్రామంలో దళితులపై ఎమ్మెల్యే సోదరుడు రాజశేఖర రెడ్డి అనుచరులు అరాచకంతో గ్రామంలో భయాందోళనలు కలిగించాయి. గ్రామానికి చెందిన మాల వన్నూరప్పను ఇంటిదగ్గర నుంచి బలవంతంగా ఎమ్మెల్యే ఇంటిదగ్గరకు తీసుకెళ్లి దాడికి పాల్పడ్డారు. ఆ దాడిలో వన్నూరప్పకు వీపుపై తీవ్రగాయాలయ్యాయి. అప్పటి నుంచి దళితులు గ్రామంలో ఎప్పుడు ఏమి జరుగుతోందని ఆందోళనతో బతుకుతున్నారు. తోపుదుర్తి సోదరుల నుంచి తనకు ప్రాణహాని ఉందని జిల్లా పోలీసుకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. తోపుదుర్తిలో ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది. వడ్డుపల్లిలో గడపగడపకు వచ్చిన సమయంలో సొంత పార్టీకి చెందిన దళితులు తమ సమస్యలు పరిష్కరించలేదని నిలదీశారు. దీంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే వారిని స్టేషన్ చుట్టూ తిప్పారు. ఆత్మకూరు దళిత కాలనీలో వైసీపీ సర్పంచ్ సోదరుడు టీడీపీలో చేరడంతో పార్టీలో ఎలా చేరుతావ్ అంటూ స్థానిక నాయకులు బెదిరించారు.

ఎమ్మెల్యేకు దళితులు అంటే పడదు



రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి మొదటి నుంచి దళితులు అంటే పడదు. అధికారంలోకి వచ్చీరాగానే గ్రామంలో 270 మంది పట్టాలను రద్దు చేసి వారి కడుపుకొట్టాడు. అప్పటి నుంచి మండలంలో చాలామంది దళితులపై వివక్ష చూపుతూ పాలనసాగిస్తున్నాడు. మరోసారి ఎన్నికలు వచ్చినా దళితులపై మాత్రం దాడులు ఆగడం లేదు. దళితులపై దాడులు చేస్తున్న ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకి ఈ ఎన్నికల్లో తప్పకుండా బుద్ధి చెబుతాం.


మొద్దు రామంజి, బి.యాలేరు, ఆత్మకూరు మండలం

ఓటేసికి రాండన్నో..!

వలస ఓటర్లను రప్పించేందుకు పార్టీల యత్నాలు
వివిధ ప్రాంతాల నుంచి ఉత్సాహంగా వస్తున్న ఓటర్లు

బుక్కరాయసముద్రంం, మే 10: స్థానిక సంస్థల ఎన్నికలను తలపించే విధంగా ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. వృత్తి, ఉ పాధి రీత్యా హైదరాబాద్, బెంగళూరు, పూణే , ముంబై తదితర నగరాలకు వలసవెళ్లిన వారందరూ ఓటు వేయడానికి సొంతూళ్లకు వస్తున్నా రు. వరుసగా సెలవులు రావడం కూడా సొం తూరి ప్రయాణానికి వారిలో ఉత్సాహం నింపుతోంది.

ఖర్చు మాదే..!



ప్రస్తుతం ఎన్నికలు హోరాహోరీగా ఉండటంతో ప్రతి ఓటు కీలకంగా మారింది. దీంతో శింగనమల నియోజకవర్గం ఓటర్లు ఏయే ప్రాంతా ల్లో ఉన్నారో.. గుర్తించి వారిని పిలిపిస్తున్నారు. ఎంత ఖర్చైనా మనమే భరిద్దాం అంటూ అభ్యర్థులు తమ కేడర్‌కు సూచిస్తున్నారు. ఓటరు జాబితాలో పేరు ఉండి ఉపాధి రీత్యా వేరే ప్రాం తాలకు వెళ్లిన వారిని ఎక్కడున్నా సరే పిలిపించి ఓటు వేయించేందుకు ఆయా పార్టీల నాయకులు సిద్ధమయ్యారు. ఐటీ సహా ఇతర ఉద్యోగాల కోసం వెళ్లిన ప్రతి ఒక్కరికి ఫోన్లు చేసి మాట్లాడుతున్నారు.

బస్సు, ట్రైన్‌లు కిటకిట

ప్రధానంగా హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, మహారాష్ట్ర తదితర ప్రాంతాలలో నుంచి రావాలంటే బస్సులు, ట్రైన్‌లు కిటకిట లాడుతున్నాయి. ఈనెల 13న పోలింగ్ జరుగుతుండటంతో పాటు మూడు రోజుల సెలవులు రావడంతో సొంత గ్రామాలకు రావడానికి పెద్ద సంఖ్యలో ఓటర్లు గ్రామాల బాట పడుతున్నారు. ప్రైవేటు, ఆర్టీసీ, రైలులో టికెట్లు ఇప్పటి ఫుల్ కావడంతో వచ్చేందుకు వలస ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారు. టిక్కెట్టు ఖర్చు ఇస్తాము.. కానీ బుక్ చేయలేమని పార్టీ కేడర్ వారికి చెబుతోంది. గ్రామంలో నలుగురైదుగురు ఉంటే కారు సిద్ధం చేసుకోండి ఖర్చు భరిస్తామని పార్టీ నేతల ఆఫర్ ఇస్తున్నారు. శింగనమల నియోజకవర్గంలో వలస ఓటర్లు దాదాపు 2500 మందిపైగా ఉన్నట్లు తెలిసింది.

విత్తన పంపిణీపై.. జగన్ సర్కార్ నిర్లక్ష్యం

గత ఏడాది మే 5కే సబ్సిడీ ధరల ఖరారు
ఈసారి మార్చిలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు
ఇప్పటి దాకా అతీగతీలేని వైనం
ఎన్నికల కమిషన్ అనుమతిలోనూ అశ్రద్ధేనా..?
పోలింగ్ తర్వాతనైనా మొదలు పెడతారా...?
ప్రభుత్వం తీరుపై రైతుల ఆగ్రహం



అనంతపురం అర్బన్, మే 10 : కరువు రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ, ఇతర రకాల విత్తనాల పంపిణీపై జగన్ సర్కార్ తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. ఈ ఏడాది మార్చి మొదటి వారంలోనే జిల్లాకు అవసరమయ్యే విత్తన వేరుశనగ, ఇతర రకాల అంతర పంటల విత్తనాల మోతాదుపై జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. రెండు మాసాలు గడుస్తున్నా ఇప్పటి దాకా అతీగతీ లేకుండా పోయింది. సార్వత్రిక ఎన్నికల సమయం కావడంతో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ప్రతి ఏడాది రెగ్యులర్‌గా జరిగే విత్తన పంపిణీపై ఎన్నికల కమిషన్ నుంచి అనుమతులు తీసుకొని ప్రక్రియను మొదలు పెట్టడంపై ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. ఇందుకు మరో మూడు వారాలే సమయం ఉంది. ఇప్పటి దాకా జిల్లాకు విత్తన కేటాయింపులు చేయకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల కమిషన్‌కు ప్రభుత్వం తరపున వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు మినహాయింపు కోసం లేఖ రాశారో..? లేదో తెలియని దుస్థితి నెలకొంది. పోలింగ్ తర్వాతయినా రాష్ట్ర ఉన్నతాధికారులు దీనిపై కదులుతారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సబ్సిడీ విత్తన కాయల పంపిణీ ఆలస్యంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మార్చిలోనే ప్రతిపాదనలు

ఈ ఏడాది మార్చిలోనే ఖరీఫ్ సీజన్‌లో విత్తన వేశనగతోపాటు ఇతర రకాల విత్తనాల కేటాయింపులకు సంబంధించి ప్రతిపాదనలు పంపారు. ఈసారి జిల్లాకు వేరుశనగ 1.25 లక్షల క్వింటాళ్లు, కంది 2,500 క్వింటాళ్లు, గ్రీన్ పచ్చిరొట్టి ఎరువులు 600, కొర్ర 100, పెసలు 100, అలసందలు 150, రాగి 50 క్వింటాళ్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఇప్పటి దాకా జిల్లాకు విత్తనాలు కేటాయించి, సంబంధించిన గైడ్‌లైన్స్‌ను జారీ చేయడంలో జగన్ సర్కార్ తీవ్ర జాప్యం చేస్తూ వచ్చింది. రెండు మాసాల క్రితమే ప్రతిపాదనలు పంపినా ఇప్పటి దాకా అతీగతీ లేకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

గత ఏడాది మేలోనే ప్రారంభం

గత ఏడాది మే మొదటి వారంలోగానే విత్తన వేరుశనగతోపాటు ఇతర రకాల విత్తనాల సబ్సిడీ ధరలు ఖరారు చేశారు. గత ఏడాది మే 16 నుంచి ఆర్బీకేల్లో రైతుల పేర్లు రిజిస్ట్రేషన్ మొదలు పెట్టారు. మే 29 నుంచి విత్తన పంపిణీ ప్రారంభించారు. ఈసారి ఇప్పటి దాకా విత్తన పంపిణీకి సంబంధించిన ఎలాంటి విధివిధానాలు జారీ కాలేదు. మరోవైపు విత్తన వేరుశనగ, ఇతర రకాల విత్తనాల ప్రాసెసింగ్ ప్రక్రియ జరగలేదు.

విత్తన పంపిణీలో జాప్యం దారుణం



కరువు రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ, ఇతర రకాల విత్తనాల పంపిణీపై ప్రభుత్వం జాప్యం చేయడం దారుణం. ఈ ఏడాది మార్చి మొదటి వారంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా మిన్నకుండిపోవడంలో అంతర్యమేమిటో అర్థం కావడం లేదు. రైతులను అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చి, ఓట్లు వేయించుకొని, అధికారంలోకి రాగానే పూర్తిగా విస్మరించారు. ఈ ఏడాది సబ్సిడీ విత్తన కాయల పంపిణీపై తీవ్ర అశ్రద్ధ వహించడం అన్యాయం. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని సకాలంలో విత్తన కాయలు పంపిణీ చేయాలి.

- చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతు సంఘం

రైతుల జీవితాలతో చెలగాటం



కరువు రైతుల జీవితాలతో జగన్ సర్కార్ చెలగాటమాడుతోంది. జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో వేరుశనగతోపాటు కంది, ఇతర రకాల పంటలు సాగవుతున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి సీజన్‌లో సబ్సిడీ విత్తన కాయలు అందజేయడంలో జాప్యం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకొని రైతులకు సకాలంలో విత్తన పంపిణీ జరిగేలా చొరవ చూపడంలో జగన్ సర్కార్ ఘోరంగా విఫలమైంది. ఐదేళ్లుగా సబ్సిడీ పథకాలు అమలు చేయకుండా రైతులకు అన్యాయం చేసిన జగన్‌కు తగిన బుద్ధి చెప్పేందుకు రైతులంతా సిద్ధంగా ఉన్నారు.

- బొల్లు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, తెలుగు రైతు విభాగం

పంపిణీకి పనికిరామా..?

స్థానిక నాయకులను నమ్మని వైసీపీ

పక్కవాళ్ల చేతులమీదుగా నోట్ల పంపిణీ

వలంటీర్లు చెప్పిన ఇళ్లకే నగదు

అభ్యర్థుల తీరుపై నాయకుల మండిపాటు

అనంతపురం క్రైం, మే 10 : సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఈసారి స్థానిక నాయకులను పట్టించుకోలేదు. ఎమ్మెల్యే అభ్యర్థులు పంపిన మనుషుల చేతుల మీదుగానే నోట్లు అందజేస్తున్నారు. అది కూడా అప్పటికే సిద్ధం చేసిన జాబితా మేరకు వలంటీర్లు సూచించిన ఇళ్లల్లో ఎంత మంది ఉన్నారో వారికి ఆ నోట్లు అందజేస్తున్నారు. దీంతో స్థానిక నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మా పైనే నమ్మకం లేదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం వలంటీర్లను నమ్మినంత కూడా నమ్మకపోతే ఇక మేమెందుకు అంటూ గుర్రుగా ఉన్నారు. తాము కేవలం పనిచేయడానికేనా అని ప్రశ్నిస్తున్నారు. సచివాలయం, వలంటీర్లను తీసుకొచ్చి ముఖ్యమంత్రి జగన్ మమ్మల్ని కనీస విలువ లేకుండా చేశాడని మండిపడుతున్నారు. ఇప్పుడు లెక్కలు పంచే విషయంలోనూ నమ్మడం లేదని, ఇదేం రాజకీయ బతుకు అంటూ నిట్టూరుస్తున్నారు. పంచాయతీల్లో సర్పంచ్, ఎంపీటీసీ స్థాయి, పట్టణాల్లో కౌన్సిలర్లు, కార్పొరేటర్లను సైతం పట్టించుకోలేదట.



స్థానిక నాయకులను కాదని..

ఈసారి ఓట్ల కోసం డబ్బుల పంపిణీలో స్థానిక నాయకులను పక్కన పెట్టడం ఆ వర్గాలను కలచివేస్తోంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. శింగనమల నియోజకవర్గంలో ఓటుకు రూ.వెయ్యి పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఇందుకు ఎస్‌ఆర్ఐటీ విద్యార్థులు, సిబ్బందినే ఉపయోగిస్తున్నారట. అనంతపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అంతరంగికులే ముందుండి పంపిణీ చేయించేశారు. ఇక్కడా ఓటుకు రూ.వెయ్యి చొప్పున వలంటీర్లు ఇచ్చిన జాబితా మేరకు డబ్బు అందజేస్తున్నారట. చాలా తక్కువలో తక్కువ మంది కార్పొరేటర్లకు పంపకాలకు సంబంధించి అందజేసినట్లు సమాచారం. తాడిపత్రి నియోజకవర్గంలో ఓటుకు రూ.2వేలు ప్రకారం ఇప్పటికే పంపిణీ చేశారు. అక్కడంతా తమ నాయకులకే అందజేసినట్లు తెలుస్తోంది. నమ్మకం లేని చోట మాత్రమే ఎమ్మెల్యే అభ్యర్థి మనుషుల సమక్షంలో పంపకాలు చేశారు. ఉరవకొండ పట్టణంలో రూ.2వేలు చొప్పున పంచేశారు. రూరల్ పరిధిలో రూ.1000 పంపిణీ చేయాలని చూస్తున్నట్లు సమాచారం. ఈ నియోజకవర్గంలోనూ కొత్త బృందాలే డబ్బును పంపిణీ చేశాయి. కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డే బాధ్యత తీసుకున్నారు. పుంగనూరు నుంచి ప్రత్యేకంగా వచ్చిన తన అనుచరులు, స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థుల అనుయాయులతో కలిసి డబ్బు పంపిణీ చేశారు. కళ్యాణదుర్గంలో ఓటుకు రూ.2వేలు, రాయదుర్గంలో రూ.1500 చొప్పున పంపిణీ చేయించారు. గుంతకల్లు నియోజకవర్గంలోనూ వలంటీర్లు, కొత్త వ్యక్తులతో పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిసింది.

పోలీసులు గప్ చుప్

వైసీపీ నాయకులు మరోసారి అధికారమే లక్ష్యంగా తెగబడుతున్నారు. ఓటర్లను లక్ష్యంగా చేసుకొని వివిధ రకాలుగా ప్రలోభాలకు గురి చేస్తున్నారు. డబ్బు పంపిణీ పూర్తవగానే మద్యం, మాంసంతో విందులు ఏర్పాటు చేయించడానికి సిద్ధమయ్యారు. ఇంత జరుగుతున్నా పోలీసులు మాత్రం గప్‌చుప్‌గా ఉన్నారు. దాదాపు ఇప్పటికే 50శాతంపైగా పంపిణీ చేసినప్పటికీ ఏ నియోజకవర్గంలోనూ పోలీసులు పట్టుకున్నది లేదు. పోలీసులకు తెలిసే ఇదంతా జరుగుతోందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

జన కేతనం 5 ఆంధ్రజ్యోతి
అనంతపురం
శ్రీ సత్యసాయి
శనివారం 11 మే 2024

మారుతున్న గాలి !

కదిరి పోరు ఏకపక్షమేనా ?

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

అంతటా ఆక్రమణలు, దౌర్జన్యాలే

రాజకీయం వర్సెస్ వ్యాపారం

వైసీపీలో అంతర్గత కుమ్ములాటలు

కందికుంటకు సానుకూలంగా పరిణామాలు



కదిరి: కదిరి అసెంబ్లీ పోరు ఉమ్మడి జిల్లాలో ఆసక్తిని రేపుతోంది. గత రెండు దశాబ్దాలుగా ప్రజా జీవితంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ టీడీపీ తరఫున బరిలో నిలిచారు. మూడునెలల ముందు పార్టీలో చేరిన వ్యాపారవేత్త మగ్బూల్ అహ్మద్ వైసీపీ తరఫున పోటీకి దిగారు. కదిరి నియోజకవర్గంలో 15 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో ఏడు సార్లు కాంగ్రెస్, నాలుగు సార్లు టీడీపీ, వైసీపీ రెండు సార్లు, బీజేపీ, ఇండిపెండెంట్‌లు ఒక్కోసారి గెలిచారు. ఇందులో ఇద్దరు మంత్రులుగా పని చేశారు. తొలి ఎమ్మెల్యే కేవీ. వేమారెడ్డి స్పీకరుగా పని చేశారు. నియోజకవర్గంలో కదిరి, తలుపుల, గాండ్లపెంట, ఎన్పీకుంట, నల్లచెరువు, తనకల్లు మండలాలు ఉన్నాయి. నియోజవర్గంలో మొత్తం 2,53,420 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 124650 మంది ఉండగా స్త్రీలు 128762 మంది, ట్రాన్స్‌జెండర్‌లు 8మంది ఉన్నారు. నియోజవర్గంలో మొత్తం 281 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

పోరు ఏకపక్షమేనా ?

కదిరి అసెంబ్లీ ఎన్నికల పోరు ఏకపక్షమేనని పలువురు చెబుతున్నారు. కూటమి అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ గడచిన 20 ఏళ్ల నుంచి స్థానికంగానే ఉంటూ రాజకీయాలు చేస్తున్నారు. నియోజకవర్గంలో ప్రతి ప్రాంతంలో ఆయనకు విస్తృత పరిచయాలు ఉన్నాయి. ఆపద వచ్చినప్పుడు అర్ధరాత్రి పిలిచినా పలికే నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారు. బెంగళూరులో వ్యాపారం చేసుకుంటూ కేవలం ఎన్నికల కోసమే వచ్చిన మగ్బూల్‌కు నియోజకవర్గంతో అంతగా పరిచయం లేదు. పైగా ఆయన నాయకత్వానికి అందరి ఆమోదం లేదు. ఆయన ఉండగానే ఎన్నికల ఇన్‌చార్జ్‌గా పూల శ్రీనివాస్‌రెడ్డిని నియమించడం వైసీపీలోని డొల్లను బహిర్గతం చేస్తున్నాయి. దీంతో వైసీపీ అభ్యర్థి గెలుపుపై సొంతపార్టీ నాయకులకే నమ్మకం లేక అనేక మంది ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి క్యూ కట్టారు. దీనికి తోడు ఎమ్మెల్యే సిద్దారెడ్డి వర్గం వైసీపీ అభ్యర్థికి పూర్తిగా దూరంగా ఉంది. ప్రచార సరళిలో కూడా వైసీపీ బాగా వెనుకబడి ఉంది. నామినేషన్‌ల రోజే వైసీపీ అధినాయకత్వం అంచనాలకు తగ్గట్టుగా ప్రజలు రాలేదని నిరుత్సాహంగా ఉన్నట్లు తెలిసింది.

ఐదేళ్లు కబ్జాలు, దౌర్జన్యాలే

వైసీపీ అధికారంలో ఉన్న గత ఐదేళ్లలో కబ్జాలు, దౌర్జన్యాలు పెరిగిపోయా యి. నిజాంవలి కాలనీలో ఉన్న బీడీ కార్మికుల కమ్యూనిటీ హాల్ కూల్చివేతతో దౌర్జన్యాలు కదిరిలో మొదలయ్యాయి. మాజీ ఎమ్మెల్యే జొన్నా రామయ్యకు చెందిన జొన్నా లాడ్జ్ ముందు పులివెందులకు చెందిన కొంత మంది, వైసీపీ నాయకులతో కలిసి బండరాళ్లు వేసి పట్టపగలే దౌర్జన్యం చేశారు. దాన్ని టీడీపీ నాయకుడు కందికుంట అడ్డుకున్నారు. ఎంపీడీఓ కార్యాలయానికి సమీపంలో వైసీపీ నాయకులు దాదాపు రెండు కోట్ల రూపాయలకు పైగా విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జా చేశారు. అడపాలవీధిలో వైసీపీ నాయకుడు అత్యంత విలువైన భూమిని అక్రమించుకొని ఇల్లు నిర్మించుకునే ప్రయత్నాన్ని కందికుంట అడ్డుకున్నారు. ఇవన్నీ వైసీపీ గెలుపుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

మట్టి మాఫియా, ఇసుక కింగ్‌లు వైసీపీ నాయకులే

నియోజకవర్గంలో మట్టి, ఇసుక ఎక్కడికి తోలాలన్నా కొంతమంది వైసీపీ నాయకులే తోలాలి. ఇతరులు తరలిస్తే కేసుల నమోదైన ఘటనలు ఎన్నో ఉన్నాయి. మట్టిమాఫియా నాయకుడు ఇన్ని రోజులు ఎమ్మెల్యే సిద్దారెడ్డి వర్గంలో కొనసాగి ఆయనకు టిక్కెట్టు రాకపోవడంతో ప్లేటు ఫిరాయించి వైసీపీ అభ్యర్థి పంచనచేరారు. ఇక ఇసుక కింగ్‌లు అనేకమందే ఉన్నారు. ఇసుక ఎక్కడికి పంపాలన్నా వారికి చెబితే చాలు. వారికి ఎటువంటి సీనరేజి చార్జిలు ఉండవట. అందుకే తక్కువ ధరకే తోలుతామని చెబుతున్నారు. వీరందరూ వైసీపీలోనే కొనసాగుతుండటంతో ప్రజలు వారిని చూస్తే ఏవగించుకుంటున్నట్లు తెలిసింది.

ఎమ్మెల్యే వర్గం దూరం

సిట్టింగ్ ఎమ్మెల్యే సిద్దారెడ్డికి వైసీపీ అధిష్టానం ఈసారి ఎన్నికల్లో టిక్కెట్టు ఇవ్వలేదు. దీంతో ఆయన వర్గం వైసీపీ అభ్యర్థి మగ్బూల్‌కు పూర్తి దూరంగా ఉంది. ఎమ్మెల్యే సామాజిక వర్గంలో కూడా ఎక్కువ మంది వైసీపీకి దూరంగా ఉన్నట్లు తెలిసింది. ముఖ్యంగా గ్రామాల్లో వైసీపీకి ఆదరణ కొరవడినట్లు సమాచారం. ఎమ్మెల్యే వర్గం దూరం కావడంతో ఏమి చేయాల్లో దిక్కుతోచని స్థితిలో వైసీపీ ఉన్నట్లు తెలిసింది.

వలసలతో వైసీపీ ఉక్కిరి బిక్కిరి

టీడీపీలోకి వలసలు పెరగడంతో వైసీపీ నాయకులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లు తెలుస్తోంది. కౌన్సిలర్లు మొదలు కొని గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధుల వలసలు నిత్యం కొనసాగుతున్నాయి. వీటి నివారణకు వైసీపీ చేసిన యత్నాలు ఏవీ ఫలించలేదు. కొంతమందికి కానులతో ఎరవేసిన ఆగలేదని టీడీపీలో చేరిన వారు చెబుతున్నారు.

నమ్మకం కోల్పోయిన వైసీపీ

కదిరి ప్రజలు వరుసగా రెండుసార్లు వైసీపీకి అవకాశం ఇస్తే గెలిచిన ప్రజాప్రతినిధులు ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశారని ప్రజలు చెబుతున్నా రు. 2014లో మైనారిటీ అభ్యర్థిగా ఉన్న అత్తార్ చాంద్‌బాషాను గెలిపిస్తే ఆయన రెండేళ్లకే పార్టీ మారి ప్రజల నమ్మకాన్ని కోల్పోయారు. అదే విధంగా 2019లో సిద్దారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఆయన కూడా అభివృద్ధి పనులు చేయలేదని చెబుతున్నారు. అందుకే ఆయన ప్రజల మద్దతు కోల్పోయారని భావించిన అధిష్టానం 2024 ఎన్నికలకు కొత్త అభ్యర్థిని బరిలో నిలిపింది.

ఇష్టారాజ్యంగా ఎన్నికల డ్యూటీ

ఉన్నఫలంగా ఉత్తర్వులు... మండిపడుతున్న టీచర్లు, ఉద్యోగులు



అనంతపురం విద్య, మే 10: మినహాయింపు ఇచ్చిన వారికి ఉన్నఫలంగా ఎన్నికల డ్యూటీ వేయడంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు. తొలుత ఆపరేషన్, దివ్యాంగత్వం, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇచ్చారు. ఇప్పుడు ఉన్న ఫలంగా డ్యూటీ వేసి, పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే సదుపాయంపై కూడా అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు మండిపడుతున్నారు. ఈ నెల 9న ఉన్నఫలంగా పలువురు ఉపాధ్యాయు లు, ఉద్యోగులకు పీఓ, ఏపీఓ, ఓపీఓ డ్యూటీలు వేశారు. అనంతపురం, శింగనమల నియోజకవర్గాలకు డ్యూటీలు వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం ఫోన్లు చేసి ఆర్ట్స్ కాలేజ్, జూనియర్‌కాలేజ్ వద్దకు రావాలని సూచించారు. మినహాయింపు పొందినా ఉన్నఫలంగా డ్యూటీ వేయడంతో ఇదెక్కడి గొడవ బాబోయ్ అంటూ....వాళ్లు చెప్పిన సమయానికి, చెప్పిన స్థలానికి బిక్కుబిక్కు మంటూ ఉపాధ్యాయులు, ఉద్యోగులు పరుగులు తీశారు. ఉదయం 10 గంటలకు వెళ్లినా...మధ్యాహ్నం 1 గంట వరకూ ఏ అధికారీ రాలేదు. సాయంత్రం వెళ్లినా ఎవరూ వచ్చి ఎలాంటి ఆదేశాలు ఇవ్వడకపోవడంతో డ్యూటీలు పడిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పీఓ, ఏపీఓలకు మూడు సార్లు శిక్షణ ఇచ్చారు. ఇప్పుడు కొత్తగా ఉత్తర్వులు ఇచ్చిన వాళ్లకు ట్రైనింగ్ అవసరం లేదా..? ట్రైనింగ్ ఇవ్వకుండా వాళ్లు ఎలా డ్యూటీ చేస్తారన్నది అధికారులకే తెలియాలి.

మద్యం మొత్తం వైసీపీ వారికే !

ఎన్నికలకు ముందు జగన్నాటకం

మద్యం షాపుల్లో కేవలం డిజిటల్ లావాదేవీలేనట

మధ్యాహ్నం నుంచి సర్వర్ బంద్.. విక్రయాలు బంద్

మద్యం అంతా అధికార పార్టీ నేతలకు తరలిస్తున్న వైనం



కమలానగర్‌లో క్యూకట్టిన మందుబాబులు

అనంతపురం అర్బన్, మే 10: పోలింగ్‌కు ఐదు రోజుల ముందే మద్యం విక్రయాల్లో జగన్నాటకం మొదలైంది. వైసీపీ ఐదేళ్లలో ప్రభుత్వ మద్యం దుకాణాలు, మాల్స్‌లో కేవలం నగదుతోనే మద్యం విక్రయాలు జరిపారు. మారుమూల ప్రాంతాల్లో టీకొట్లు, తోపుడు బండ్ల వద్ద డిజిటల్ లావాదేవీల సదుపాయం ఉన్న కాలంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఎందుకు డిజిటల్ లావాదేవీలు పెట్టలేదని ప్రతిపక్షాలు అనేక సార్లు గొంతెత్తినా ప్రభుత్వం పట్టించుకోలేదు. పోలింగ్‌కు ఐదు రోజుల ముందుగా గురువారం నుంచి మద్యం దుకాణాల్లో కేవలం డిజిటల్ లావాదేవీలే జరపాలని, క్యాష్ ఎట్టిపరిస్థితుల్లోనూ తీసుకోకూడదని ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా మద్యం షాపుల్లో కేవలం ఫోన్ పే, గుగూల్ పే ద్వారా మాత్రమే అనుమతించారు. ఈ విషయం తెలియక మందు బాబులు క్యాష్‌ను తీసుకువెళ్లారు. ఐదేళ్ల పాటు డిజిటల్ లావాదేవీల ఆప్షన్ పెట్టాలని కోరినా పట్టించుకోకుండా ఇప్పుడేమో కేవలం ఫోన్ పే అంటారా అంటూ మందుబాబులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ లావాదేవీలపై జిల్లా ఎక్సైజ్ అధికారులు ముందస్తుగా ప్రజలకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఎన్నికల సమయం కావడంతో అధికార పార్టీ నేతలకు ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి అడిగినన్నీ లిక్కర్ బాటిళ్ల గుట్టుచప్పుడు కాకుండా రాత్రికి రాత్రే పంపిస్తున్నట్లు తెలిసింది. కొందరు మద్యం షాపులో పనిచేసే సిబ్బంది సందట్లో సడేమియా అన్న చందంగా బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో ఏ దుకాణానికి వెళ్లినా తమకు నచ్చిన బ్రాండ్లు లేకపోవడంతో నిరాశతో మందుబాబులు వెనుతిరగాల్సి వస్తోంది. పలు మద్యం దుకాణాల్లో కనీసం చీప్ లిక్కర్ అడిగినా స్టాక్ లేదంటూ సిబ్బంది చెబుతున్నారు. దీంతో ఇదెక్కడి అన్యాయమంటూ మందుబాబులు నిట్టూరుస్తున్నారు. అనంతపురం నగరంతోపాటు పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సర్వర్ పనిచేయకపోవడంతో మద్యం విక్రయాలు ఆగిపోయాయి. ఎన్నికల నిబంధనల మేరకు శనివారం సాయంత్రం 5 గంటల నుంచి ఈనెల 13వతేదీ సాయంత్రం 7 గంటల దాకా ప్రభుత్వ మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు బంద్ కానున్నాయి. ఈ నేపథ్యంలో ముందస్తుగా మద్యం స్టాక్ పెట్టుకుందామన్న ఆలోచనతో శుక్రవారం మద్యం షాపులు, మాల్స్ వద్ద మందు బాబులు క్యూకట్టారు. తీరా అక్కడికి వెళితే తమకు కావాల్సిన బ్రాండ్లు లేకపోవడంతో ఎలగబ్బా అంటూ నిట్టూర్చారు. దీంతో షాపులో ఏ మద్యం ఉంటే అదే కొనుగోలు చేసి సరిపెట్టుకోవాల్సి వచ్చింది. మరికొన్ని షాపుల్లో ఆ అవకాశం కూడా లేకపోవడంతో బార్ అండ్ రెస్టారెంట్లకు వెళ్లి అధిక ధరకు మద్యం కొనుగోలు చేయాల్సిన దుస్థితిని మద్యంప్రియులు ఎదుర్కొన్నారు. ఇదే క్రమంలో బార్ అండ్ రెస్టారెంట్లు కిటకిటలాడాయి.



త్రివేణి థియేటర్ సమీపంలో మూతబడిన మద్యం షాపు

రేయ్ సాంబా.. కారు దిగు రా..!

ఏ ముఖం పెట్టుకుని

మా వద్దకు వచ్చావ్..?

ఆలూరు సాంబకు అవమానం

ఇంట్లోకి లాక్కెళ్లి నిర్బంధించిన

అసమ్మతి వర్గం నాయకులు

నార్పల, మే 10: నార్పలలో వైసీపీ అసమ్మతి నాయకుడు సత్యనారాయణరెడ్డి ఇంటికి వెళ్లిన సిటింగ్ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి భర్త, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డికి ఘోర అవమానం జరిగింది. సత్యనారాయణ రెడ్డి అనుచరులు సాంబను అసభ్య పదజాలంతో దూషిస్తూ.. దాడికి యత్నించారు. ఇంట్లోకి తీసుకెళ్లి నిర్బంధించారు. శింగనమల నియోజకవర్గ అభ్యర్థిగా తన వద్ద టిప్పర్ డ్రైవర్‌గా ఉన్న వీరాంజనేయులుకు సాంబ టిక్కెట్ ఇప్పించుకున్నారు. దీన్ని వైసీపీ అసమ్మతి వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యేలు శమంతకమణి, యామినీబాల తదితరులు పార్టీని వీడి టీడీపీలో చేరారు. మరికొందరు వైసీపీలోనే కొనసాగుతున్నారు. వీరిలో నార్పల సత్యనారాయణరెడ్డి ఒకరు. ఈ నేపథ్యంలో వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులుతో కలిసి నార్పలలో శుక్రవారం రోడ్ షో, బహిరంగ సభ నిర్వహించేందుకు సాంబ వెళ్లారు. రోడ్ షోకు సత్యనారాయణరెడ్డి రాకపోవడంతో.. ఆహ్వానించేందుకు సాంబ నేరుగా ఆయన ఇంటి వద్దకు వెళ్లారు. సాంబను చూడగానే సత్యనారాయణరెడ్డి వర్గీయులు ఆగ్రహంతో ఊగిపోయారు. 'రేయ్ సాంబా.. కారు దిగురా..! ఏ ముఖం పెట్టుకుని మా అన్న ఇంటికి వస్తున్నావ్..? నీ అంతు చూస్తాం..' అని అసభ్య పదజాలంతో దూషిస్తూ.. దాడికి యత్నించారు. సాంబ కారు అద్దాలను ధ్వంసం చేశారు. 'నీకు మా నాయకుడికంటే మించిన లీడర్లు ఎవరున్నారు..? మా నాయకుడిని ర్యాలీగా బహిరంగ సభకు ఎందుకు తీసుకెళ్లలేదు..?' అని నిలదీశారు. కారులో ఉన్న సాంబశివారెడ్డిని కిందకు దించి.. సత్యనారాయణరెడ్డి ఇంట్లోకి తీసుకెళ్లి తలుపులు మూసేశారు. దీంతో ఉద్రిక్తత ఏర్పడింది. అక్కడే ఉన్న పోలీసులు సత్యనారాయణరెడ్డి అనుచరులను శాంతింపజేశారు. అద్దాలు పగిలిన కారును మీడియా కంటపడనివ్వకుండా అక్కడి నుంచి పంపించేశారు. చివరకు సత్యనారాయణరెడ్డిని బుజ్జగించి, బహిరంగ సభకు తీసుకెళ్లారు. కానీ జనాలు లేక సభ వెలవెలబోయింది. వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులును ఓడిస్తామని సభ వద్దే సత్యనారాయణరెడ్డి అనుచరులు హెచ్చరించడం గమనార్హం.



సాంబ వాహనాన్ని అడ్డుకున్న అసమ్మతి వర్గం

ఆస్తులు గోవిందా

జగన్ మళ్లీ వస్తే భూములకు రక్షణ కరువు

హిందూపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి బీకే

అడుగడుగునా నీరాజనం



పరిటాల సునీత, పార్థసారథి, శ్రీరామ్‌ను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

పుట్టపర్తి, మే 10 (ఆంధ్రజ్యోతి)

వైసీపీ మరోసారి అధికారంలోకి వచ్చి జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే మీ ఆస్తులు గోవిందా అంటూ హిందూపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాప్తాడు నియోజకవర్గంలోని పలు మండలాల్లో పర్యటించారు. రాప్తాడు, చెన్నెకొత్తపల్లి మండలాల్లో జరిగిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ పేద, మధ్య తరగతికి చెందిన ఆస్తులను లాక్కునేందుకే ఈ యాక్ట్ తీసుకొచ్చారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఈ యాక్ట్ లేదన్నారు. జగన్‌రెడ్డి ఇది తీసుకురావడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రజల భూములు కబ్జాచేసేందుకే ల్యాండ్ టైటిలింగ్ చట్టం తెచ్చారని విమర్శించారు. ఈ నల్లచట్టాన్ని రద్దు చేయాల్సిందే అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఈ చట్టం రద్దవుతుందని హామీ ఇచ్చారు. ఈ భూభక్ష చట్టంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. కానీ ప్రజలను మోసం చేయడానికి ఈ చట్టం ఇంకా మార్గదర్శకాలు ఇవ్వలేదని నాటకాలు ఆడుతున్నారని అన్నారు. దేశంలో ఎక్కడాలేని ఈ చ ట్టాన్ని ఎందుకు ఇక్కడ అమలు చేస్తున్నారో ప్రజలు సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రంలో ల్యాండ్, శాండ్, మైన్స్, గంజాయి, యర్రచందనం, డ్రగ్స్, రేషన్ బియ్యం, కొల్లగొడుతూ వేల కోట్లు దోచేశారని విమర్శించారు. వైసీపీ నాయకులు ఏ భూమి కావాలంటే ఆ భూమిని దర్జాగా కబ్జాచేసి ఆక్రమించుకునేందుకు ఈ చట్టం ఉపయోగపడుతుందన్నారు. చెన్నెకొత్తపల్లి మండలంలో జరిగిన రోడ్‌షోలో పాల్గొన్నారు. రాప్తాడు ఎన్నికల ప్రచారంలో బీకే పార్థసారథి తోపాటు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత, యువనేత పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. వీరికి అడుగడుగునా జనం హారతులుపట్టి భారీ గజమాలతో స్వాగతం పలికారు. ప్రజలు ఆలోచించి భవిష్యత్తు బాగు చేసే నాయకుడు రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టించే చంద్రబాబుకు మద్దతు ఇవ్వాలన్నారు. విలువైన ఓట్లను సైకిల్ గుర్తుకు వేయాలని కోరారు.

మేనిఫెస్టోలో బీసీలకు పెద్ద పీట

అనంతపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, మే 10 : కూటమి మేనిఫెస్టోలో బీసీలకు పెద్ద పీట వేశామని అనంతపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక యాదవ భవన్‌లో బీసీల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన అంబికా మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయితేనే బీసీలతోపాటు అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే బీసీల కోసం రక్షణ చట్టం తెస్తామని పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడంతోనే జగన్ సరిపెట్టారని అన్నారు. నిధులు కేటాయించకుండా కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశాన్నారు. కార్పొరేషన్లలో చైర్మన్లు, కమిటీ సభ్యులు కుర్చునేందుకు కుర్చీలు కూడా లేవన్నారు. అలాంటప్పుడు కార్పొరేషన్లు పెట్టడం ఎందుకని ప్రశ్నించారు. వైసీపీలోని బీసీలు కూడా ఈ విషయాలను పరిగణలోకి తీసుకొని చంద్రబాబు నాయకత్వాన్ని సమర్థించి, బీసీ కులాల బాగు కోసం కలిసికట్టుగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే బీసీ సబ్ ప్లాన్ ద్వారా ఐదేళ్లల్లో లక్షన్నర కోట్లు కేటాయిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. బీసీలకు స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో 34 శాతం రిజర్వేషన్ ఇవ్వడంతోపాటు అన్నింటా బీసీలకు ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. ఈ ఎన్నికల్లో బీసీలంతా ఏకమై టీడీపీకి సంపూర్ణ మద్దతు నివ్వాలన్నారు. రాష్ట్ర అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమం కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. బీసీలతోపాటు అన్ని వర్గాల ప్రజలు ఈనెల 13న ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పాలని ఎదురుచూస్తున్నారని అన్నారు. కేంద్రంలో ప్రధాన మంత్రిగా మోదీ.. రాష్ట్రంలో సీఎంగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయడం ఖాయన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంతోపాటు అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుస్తారని తెలిపారు.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.3

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

అనంతపురం ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. అనంతపురం అర్బన్				
2. రాప్తాడు				
3. శింగనమల				
4. తాడిపత్రి				
5. గుంతకల్లు				
6. ఉరవకొండ				
7. కళ్యాణదుర్గం				
8. రాయదుర్గం				
9. ధర్మవరం				
10. కదిరి				
11. పుట్టపర్తి				
12. పెనుకొండ				
13. హిందూపురం				
14. మడకశిర				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : సర్వే నెం. 239-2a, బెంగళూరు బైపాస్, కక్కలపల్లి క్రాస్, అనంతపురము- 515001.

జేఎన్‌టీయూ బీటెక్ ఫలితాల విడుదల

అనంతపురం సెంట్రల్, మే 10: జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ నాలుగో సంవత్సరం విద్యార్థుల పరీక్షా ఫలితాలను ప్రిన్సిపాల్ సత్యనారాయణ తన కార్యాలయంలో శుక్రవారం విడు దల చేశారు. ఈ నెల మూడో తేదీ వరకు ద్వితీయ సెమిస్టర్ (ఆర్ 20) రెగ్యులర్ పరీక్షలను నిర్వహించామని, వారం లోగా మూ ల్యాంకనం చేయించి ఫలితాలను విడుదల చేశామని ఆయన తెలి పారు. విద్యార్థులు తమ ఫలితాల కోసం కళాశాల అకడమిక్ సెక్షన్ ను సంప్రదించాలన్నారు. ఫలితాల కోసం అకడమిక్ సెక్షన్ కు వెళ్లిన విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజులు మొత్తం పూర్తిగా చెల్లిస్తేనే ఫలితాలు చూపిస్తామని, సర్టిఫికెట్లు ఇస్తామని కళాశాల యాజమాన్యం చెబుతుండటంతో వారు అయోమయంలో పడ్డారు. ప్రభుత్వం ఫీజు మొత్తాన్ని విడుదల చేయకుంటే తామెలా కట్టాలని తల్లిదండ్రులు వాపోతున్నా... ఫీజు కట్టాల్సిందేనని కళాశాల యాజమాన్యం పట్టుపడుతోంది.

కూటమి అభ్యర్థిని గెలిపిద్దాం: చిలకం



పాదయాత్రలో ఓటరును పలకరిస్తున్న చిలకం మధు

ధర్మవరం, మే 10: కూటమి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ యాదవ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించి ధర్మవరాన్ని కాపాడుకుందామని జనసేన రాష్ట్ర ప్రదానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ప్రజలను కోరారు. పట్టణంలో పలు వార్డుల లో శుక్రవారం ఆయన పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వస్తేనే నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. ధర్మవరంలో రౌడీయిజం, భూకబ్జాలు లేకుండా ప్రశాంత వాతావరణం కలగాలంటే సత్యకుమార్ గెలవాలన్నారు. కావున ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో కమలం గుర్తుకు ఓటు వేసి సత్యకుమార్‌ను ఎమ్మెల్యేగా, సైకిల్ గుర్తుకు ఓటు వేసి బీకే పార్థసారథిని ఎంపీగా గెలుపించాలని అభ్యర్థించారు. జనసేన నాయకులు బెస్తశ్రీనివాసులు, అడ్డగిరి శ్యాంకుమార్, రాజారెడ్డి పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయండి: ఎస్పీ



కొండకమర్లలో పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

ఓబుళదేవరచెరువు, మే 10: ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. మండలంలోని కొండకమర్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ఓడీ చెరువు జిల్లా పరిషత్ పాఠశాలలో గల పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు నిర్భంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్, 30పోలీస్ యాక్టు అమలులో ఉంటుందన్నారు. ప్రజలు ఎక్కడా గుమి కూడరాదన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ నిషేధన్నారు. అనంతరం నల్లమాడ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్, ఎస్ఐ వంశీకృష్ణతో మండలంలో సమస్యాత్మక గ్రామాల గురించి అడిగారు. పోలింగ్ కేంద్రాల వద్ద, సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇమ్మాలెన్నా

నంబులపూలకుంట, మే 10: మండలంలోని గూటిబైలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల ప్రత్యేక పోలీసు పరిశీలకులు ఇమ్మాలెన్నా శుక్రవారం పరిశీలించారు. తొలుత ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిమ్మమ్మమర్రిమానును సందర్శించి తిమ్మమాంబ, బాలవీరయ్యకు పూజలు చేశారు. మర్రిమాను విశిష్టతను తెలుసుకున్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, ఏర్పాట్లపై పోలింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎలక్షన్ సీఐ తబ్రేజ్, రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు శ్రీధర్, క్రిష్ణవేణి ఉన్నారు.

కేతిరెడ్డికి రాజకీయ భిక్ష పెట్టిందే మేము

- బీజేపీ నాయకుడు కోటిబాబు

బత్తలపల్లి, మే 10: ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డికి, ఆయన కుటుంబానికి రాజకీయ భిక్ష పెట్టింది తమ కుటుంబమేనని, ఆ విషయాన్ని ఆయన మరవరాదని బీజేపీ నాయకుడు కోటి సూర్యప్రకాష్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కోటిబాబు మాట్లాడుతూ కేతిరెడ్డి రాజకీయ భవిషత్తు కోసం కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టిన కుటుంబం మాది అని తెలిపారు. నన్ను విమర్శించే అర్హత కేతిరెడ్డికి లేదన్నారు. ప్రతి పనికి కమిషన్ తీసుకోవడం ఎమ్మెల్యేకు అలవాటైందన్నారు. మాజీ ఎమ్మెల్యేతో కూడా రూ.5కోట్లు తీసుకున్నారని, తీసుకోలేదని ప్రమాణం చేయగలవా అని సవాల్ విసిరారు. కేతిరెడ్డి కి అపద్దాలు చెప్పడం, మోసాలు చేయడం అలవాటేనన్నారు. నేను కురబ కార్పొరేషన్ చైర్మన్‌గా, నా భార్య జడ్పీటీసీ మెంబర్ ఉన్నామని, మేము ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళితే.. అక్కడ పనులు కాకుండా చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. ఈ మండలంలో వైసీపీని బతికించిందే నేను అని తెలిపారు. మీ కోసం, పార్టీ కోసం ఆస్తులు అమ్మి ఖర్చు చేశామన్నారు. అది కూడా మరచి తనకే నమ్మకద్రోహం చేశారని ఆగ్రహించారు. మరోసారి తనపై విమర్శలు చేస్తే అదే స్థాయిలో సమాదానం ఉంటుందంటూ హెచ్చరించారు. ఆయన భార్య కోటి సుధ మాట్లాడుతూ నమ్ముకున్న వారు ఆస్పత్రుల్లో ఉంటే పరామర్శించేందుకు కూడా వెనకాడే వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి ఈ కేతిరెడ్డి అని విమర్శించారు. నాయకులు వీర నారప్ప, నరసిహులు, టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

'కూటమి అభ్యర్థులకే మా మద్దతు'

కదిరిఅర్బన్, మే 10: రాష్ట్రవ్యాప్తంగా కూటమి అభ్యర్థులకే మా మద్దతు తెలుపుతున్నట్లు తొగటవీర క్షత్రియ సంఘం రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. కదిరిలో శుక్రవారం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయప్రసాద్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంతోనే బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి జరుగుతుందన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో వెనుకబడిందన్నారు. తమ సంఘం కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తుందన్నారు. అనంతరం కందికుంటను పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు క్రిష్ణమూర్తి, శ్రీనివాసరావు, కోటేశ్వరరావ బండి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరుల మద్దతు..

ధర్మవరం: కుమ్మరుల మద్దతు కూటమి అభ్యర్థులకేనని కుమ్మర యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పెళ్లూరు సుమన్ ప్రజాపతి పేర్కొన్నారు. పట్టణంలోని శాంతినగర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 20 లక్షలు పైగా ఉన్న కుమ్మరులను వైసీపీ ప్రభుత్వం ఏనాడూ పట్టించుకోలేదన్నారు. అందుకే ఈ సారి కూటమి అభ్యర్థులకు మద్దతు తెలుపు తున్నామన్నారు. ధర్మవరంలో సత్యకుమార్‌ను గెలిపించుకుం దామని కుమ్మర కులస్థులకు పిలుపునిచ్చారు. కుమ్మరసంఘంనాయకులు పాల్గొన్నారు.

దళితుల మద్దతు..

ధర్మవరం: చంద్రబాబుకే దళితులు మద్దతు తెలపాలని టీడీపీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు రేగాటిపల్లి వరదరాజులు ప్రకటనలో కోరారు. దళితుల సంక్షేమం ఆయనతోనే సాధ్యమన్నారు. కనుక ఎన్నికల్లో దళితులు కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

కూటమికి పట్టం కట్టండి: పల్లె సింధూర



తంగేడుకుంటలో పల్లె సింధూర, పల్లె కిశోర్‌రెడ్డి రోడ్‌షో



కొత్తచెరువులో సింధూర ప్రచారం



కొట్లపల్లిలోని ప్రచారంలో మాట్లాడుతున్న మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి

ఓబుళదేవరచెరువు, మే 10: ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే కూటమికి పట్టం కట్టాలని, చంద్రబాబును సీఎం చేసుకుందామని కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని తంగేడుకుంట పంచాయతీలో తంగేడుకుంట, మద్దకవారిపల్లి, బుచ్చురాజుపల్లి, ఎర్రబల్లి, బలిజపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆమె, యువనాయకుడు పల్లె వెంకట కృష్ణకిశోర్ రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. గ్రామాల్లో ప్రజలు, నాయకులు పూలమాలలు వేసి, బాణసంచా కాల్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. పల్లె సింధూర మాట్లాడుతూ అభివృద్ధిని కాంక్షించే కూటమికే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. తాను ఎమ్మెల్యే అయితే నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పల్లె కిశోర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన జరిగే పోలింగ్‌లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి వేయాలని అభ్యర్థించారు. పల్లె సింధూర ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని అభ్యర్థించారు. అవినీతి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని ఇంటికి పంపాలన్నారు. తర్వాత రోడ్‌షో చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జయచంద్ర, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తచెరువు: మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం పల్లె సింధూర ఎన్నికల ప్రచారం చేపట్టారు. స్థానిక పోతలప్పస్వామి ఆలయం నుంచి ప్రచారాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు చేస్తారన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బీకే పార్థసారథిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పల్లె సింధూరను గెలిపించండి

పుట్టపర్తి రూరల్: మండలంలోని కొట్లపల్లి, రాచువారిపల్లి గ్రామాల్లో మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఎన్నికల ప్రచారం చేపట్టారు. రోడ్‌షో చేస్తూ ప్రజలను ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. అవినీతి వైసీపీ పాలనకు చరమగీతం పాడాలన్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో ఎక్కడా మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదన్నారు. సత్యసాయిబాబా ప్రజల కోసం తాగునీటి ప్రాజెక్టును తీసుకొస్తే ఈ శ్రీధర్‌రెడ్డి ఆ తాగునీటిని తన సొంతతోటలకు మళ్లించారన్నారు. ఇంత అరాకచ ఎమ్మెల్యేను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. పల్లె సింధూర గెలిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తారన్నారు. నియోజకవర్గానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకొస్తారన్నారు. కనుక అందరూ ఈనెల 13న జరిగే పోలింగ్‌లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ విజయ్ కుమార్, కూటమి శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

20 ఏళ్లుగా మీవెంటే ఉన్నా.. ఆదరించండి: కందికుంట



గంగన్నగారిపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కందికుంట



కటకంవారిపల్లిలో యశోదమ్మకు హారతి పడుతున్న మహిళలు

కదిరిఅర్బన్, మే 10: గత 20 ఏళ్లుగా మీ వెన్నంటే ఉన్నాను, ఓడినా.. గెలిచినా.. తోడుగా ఉండి మీ సమస్యల పరిష్కారానికే కృషి చేశా.. ఈ ఎన్నికల్లో తనను ఆదరించాలని, సైకిల్ గుర్తుకుఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కూటమి టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రూరల్ పరిధిలోని గంగన్నగారిపల్లిలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటా తిరుగుతూ ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. చంద్రబాబు సీఎం అయిన వెంటనే వాటిని అమలు చేస్తారని చెప్పారు. చంద్రబాబుతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కనుక ఆయన్ను సీఎం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తాను 20 ఏళ్లుగా నియోజకవర్గ ప్రజల వెంటే ఉన్నానని, అనునిత్యం వెన్నంటే ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేశానని తెలిపారు. కనుక ఈ ఎన్నికల్లో ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అలాగే ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలన్నారు. అనంతరం స్థానిక పలువురు వైసీపీ కార్యకర్తలు కందికుంట సమక్షంలో టీడీపీలోకి చేరారు. చేరినవారిలో ఉదయ్‌శేఖర్, వెంకటరమణ, శ్రీనివాసులు, శేషాద్రి, గోపాల్‌నాయక్ తదితరులు ఉన్నా రు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిరి: పట్టణంలోని 6వ వార్డులోని న్యూ అమీన్‌నగర, హరిజనవాడలో కందికుంట వెంకటప్రసాద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు ఇంటింటికెళ్లి ఈనెల 13న జరగనున్న పోలింగ్‌లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అలాగే సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కందికుంట యశోదమ్మ ప్రచారం

నంబులపూలకుంట: మండలంలోని కటకంవారిపల్లి, మూడుపుల జీవి, మేకలచెరువు గ్రామాల్లో కందికుంట వెంకటప్రసాద్ సతీమణి కందికుంట యశోదమ్మ ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటా తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేసి కందికుంట వెంకట ప్రసాద్‌ను ఎమ్మెల్యేగా, బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. కూటమి అధికారంలోకి వస్తే చేపట్టే పథకాలు, అభివృద్ధి పనుల గురించి వివరించారు. టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరిక

కదిరిఅర్బన్: కదిరి మండలం ముత్యాలచెరువు, సున్నపుగుట్ట తండాకు చెందిన పలువురు టీడీపీలోకి చేరారు. వారు పట్టణంలోని కందికుంట నివాసంలో ఆయన సమక్షంలో చేరారు. వారికి కందికుంట కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరినవారిలో నవీన్, నరేంద్ర, కార్తీక్, నారాయణ, ధనుంజయ, ఆంజనేయులు, నారాయణ స్వామి, బాలు, రవి, రవినాయక్, చంద్రశేఖర్, మంజు, మల్లికార్జున, చరణ్, నాగరాజుతోపాటు మరో 20మంది ఉన్నారు.

భూములు కాజేసేందుకే ల్యాండ్‌టైటిలింగ్ యాక్టు

కదిరి: ప్రజల భూములను కాజేసేందుకే రాష్ట్రంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్టును వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టును దేశంలో ఏ రాష్ట్రమూ ప్రవేశపెట్టలేదన్నారు. జగన్‌రెడ్డి మాత్రం 2023 అక్టోబరు 31న చట్టం అమలులోకి వచ్చినట్లు జీవో నంబరు 512ను తెచ్చారన్నారు. ఏపీ ల్యాండ్ అథారిటీని ఏర్పాటు చేసి, చైర్‌పర్సన్, కమిషనర్, సభ్యులను కూడా నియమించి 2023 డిసెంబరు 29న ఉత్తర్వులిచ్చారన్నారు. అయితే ఈచట్టంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో ఈచట్టానికి ఇంకా మార్గదర్శకాలు ఇవ్వలేంటూ.. అపద్ధాలు చెబుతున్నారన్నారు. రాష్ట్రంలో ల్యాండ్, శాండ్, వైన్, మైన్, గంజాయి వంటి వాటిని తన గుప్పెట్లో పెట్టుకున్న ముఖ్యమంత్రి ఇపుడు ప్రజల భూములను కాజేయడానికి కొత్తచట్టం తెచ్చారన్నారు. దీని ప్రకారం ల్యాండ్‌టైటిలింగ్ అధికారి చెప్పిందే ఆఖరవుతుందని, దీనిపైన కోర్టుకు వెళ్లాలంటే హైకోర్టుకు మాత్రమే వెళ్లే విధంగా చట్టం రూపొందించారని తెలిపారు. ప్రజలనుంచి వ్యతిరేకత రావడంతో జనగ్‌రెడ్డి భయపడుతున్నారన్నారు. ఈచట్టం రద్దు కావాలంటే కూటమి అధికారంలోకి రావాలని కందికుంట పేర్కొన్నారు.

వైసీపీ నాయకుల దౌర్జన్యం

- టీడీపీ మాజీ కౌన్సిలర్ కుటుంబీకులపై దాడి
- నానా దుర్భాషలు



గణేశ్‌ను పరామర్శిస్తున్న సత్యకుమార్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దివాకర్

ధర్మవరం, మే 10: పట్టణంలో వైసీపీ నాయకులు దౌర్జన్యానికి దిగారు. స్థానిక కొత్తపేటలో టీడీపీకి చెందిన మాజీ కౌన్సిలర్ మాదన మహేశ్వరి కుటుంబీకులపై శుక్రవారం రాత్రి మారణాయుధాలతో దాడి చేశారు. నానా దుర్భాషలాడారు. మాదన మహేశ్వరి భర్త సుబ్బయ్యతో అదే ప్రాంతానికి చెందిన వైసీపీ నాయకులు, కౌన్సిలర్ భాగ్యలక్ష్మి భర్త కేశవరెడ్డి, మరికొందరు వాగ్వాదానికి దిగారు. నానా దుర్భాషలాడారు. ఆగ్రహంతో ఊగిపోయిన వారు మారణాయుధాలతో సుబ్బయ్యతోపాటు అతడి భార్య మాదన మహేశ్వరి, కుమారులు దివాకర్, గణేశ్‌పై దాడిచేసి, తీవ్రంగా గాయపరిచారు. వారంతా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్, టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఆస్పత్రికి చేరుకుని, బాధితులను పరామర్శించారు. సత్యకుమార్ మాట్లాడుతూ.. కేతిరెడ్డికి ఓటమి భయం పట్టుకుని దాడులు చేయిస్తున్నారన్నారు. ప్రజాక్షేత్రంలో ప్రజాబలంతో గెలవాలి తప్ప.. ఇలా దాడులు చేయడం సరికాదన్నారు. పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనీ, దాడి చేసిన వారిపై తక్షణమే హత్యాయత్నం కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే శనివారం ఉదయం డీఎస్పీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగుతామన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ముమ్మర ప్రచారం



కొర్తికోటలో ప్రచారం చేస్తున్న టీడీపీ శ్రేణులు

తనకల్లు, మే 10: మండలంలోని కొర్తికోట పంచాయతీలో కొండవెనుకపల్లి, మించలవారికోట, తుమ్మలవారిపల్లి, తొడేళ్లగడ్డపల్లి, మంగదిన్నెపల్లి, కొర్తికోట గ్రామాల్లో శుక్రవారం టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ ఎస్కే. మస్తాన్‌వలి కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి సూపర్‌సిక్స్ పథకాలపై ముమ్మర ప్రచారం చేపట్టారు. ఇంటింటా తిరిగి ప్రజలకు కరపత్రాలు పంచుతూ పథకాల గురించి వివరించారు. ఈ పథకాల వల్ల అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని తెలియజేశారు. చంద్రబాబు సీఎం కాగానే వాటిని అమలు చేస్తారని చెప్పారు. కనుక ఎన్నికల్లో కూటమి విజయానికి తోడ్పడాలని, సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్‌ను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని అభ్యర్థించారు. అలాగే మండలకేంద్రంలో ఇందిరానగర్, తారకరామానగర్, బూడిదగడ్డవీధి ప్రాంతాల్లో టీడీపీ నాయకులు మంజునాథ్, హనుమంతరెడ్డి కార్యకర్తలతో కలిసి సూపర్ సిక్స్‌పై ఇంటింటా ప్రచారం చేశారు.

పుట్టపర్తి: మండలంలోని వెంగళమ్మచెరువులో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం చేశారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. నాయకులు శ్రీరామిరెడ్డి, పుల్లప్ప,వాసు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండలంలోని కురమామిడి పంచాయతీలో కూరమామిడి, పాయకట్టు, గొల్లపల్లి, పోతులవాండ్లపల్లి, పచ్చార్ల మేకల తండా, రెక్కమాను గ్రామాల్లో కూటమి నాయకులు టీడీపీ మండల కన్వీనర్ కొండయ్య ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్‌ను, ఎంపీగా బీకే పార్థసారధి ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ప్రసాద్, సర్పంచ్‌లు సుధాకర్, శివప్పనాయుడు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థిపై ఎమ్మెల్యే అనుచరుల దాడి



అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న అబ్దుల్‌ఖాదర్, ఆయన సోదరుడు

పుట్టపర్తి రూరల్, మే 10: పుట్టపర్తి అసెంబ్లీ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి అబ్దుల్‌ఖాదర్‌పై ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి అనుచరులు దాడిచేశారు. దీనిపై బాధితుడు ఎమ్మెల్యేపైనా, ఆయన అనుచరులపైనా అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. స్వతంత్ర అభ్యర్థి, తన అన్న ముస్కిన్‌వలితో కలిసి నల్లమాడలో శుక్రవారం ఎన్నికల ప్రచారం ముగించుకుని సాయంత్రం 5గంటల ప్రాంతంలో చిత్రావతిరోడ్‌లోని తన స్వగృహానికి చేరుకున్నారు. అక్కడే రోడ్డుపై ఎమ్మెల్యే తన వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేశారు. దీంతో ముందుకు వెళ్లడానికి వీలు కాక పోవడంతో తాము కూడా రోడ్డులోనే కారు పార్క్ చేశామన్నారు. అదేసమయంలో ఎమ్మెల్యే చిత్రావతి గుట్టమీదనుంచి వస్తూ నన్ను చూసి రెచ్చిపోయి బూతులు తిట్టారన్నారు. దీంతో తాము భయపడి పరుగులు తీశామన్నారు. అయినా వదలకుండా మాపై రాళ్ల దాడి చేశారన్నారు. నా ప్రచార వాహనాన్ని ధ్వంసం చేశారన్నారు. దీంతో మేము పోలీసుస్టేషన్‌కు పరిగెత్తామన్నారు. ఎమ్మెల్యేనుంచి భద్రత కల్పించాలని పోలీసులను కోరామన్నారు. ఘటనపై సీఐ కొండారెడ్డికి ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు.

సైకోను సాగనంపండి: సత్యకుమార్



ధర్మవరంలో ప్రచారం చేస్తున్న సత్యకుమార్

ధర్మవరం, మే 10: రాష్ట్రంలో సైకో జగన్ పాలనను సాగనంపాలని కూటమి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని 10, 11, 12వ వార్డుల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరిగి ప్రజలకు కూటమి మేనిఫెస్టోను వివరించారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వస్తేనే అభివృద్ధి పనులు వేగంగా జరుగుతాయన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఈ ఎన్నికల్లో సైకో జగన్ పాలనను తరిమేయాలని తెలిపారు. కమలం గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు.

వాల్మీకులను ఎస్టీల్లో కలిపే దిశగా కృషి చేస్తా

ధర్మవరంరూరల్/ ధర్మవరం: వాల్మీకులను ఎస్టీజాబితాలోకి చేర్చేందుకు తనవంతుగా కృషిచేస్తానని సత్యకుమార్ హామీ ఇచ్చారు. ధర్మవరం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో వాల్మీకుల అభివృద్ధి సత్యకుమార్‌తో సాధ్యమనే కరపత్రాలను వాల్మీకులు ఆయన చేత విడుదల చేయించారు. అనంతరం వాల్మీకుల పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కూటమి అధికారంలోకి రాగానే అన్నింటినీ పరిష్కరిస్తామని, ముఖ్యంగా వాల్మీకులను ఎస్టీల్లో కలిపే దిశగా కృషి చేస్తానని సత్యకుమార్ హామీ ఇచ్చారు. అంతకుమునుపు వాల్మీకులు స్థానిక టీడీపీ కార్యాలయంలోనూ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వాల్మీకులను ఎస్టీల్లోకి కలిపేందుకు సత్యకుమార్ తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కనుక ఈ ఎన్నికల్లో తమ మద్దతు ఆయనేనని స్పష్ట చేశారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు మద్దిలేటి, బొట్టుకిష్ట, జింకలరాజన్న తదితరులు పాల్గొన్నారు.

సత్యకుమార్ సంకల్పపత్రం మేనిఫెస్టో విడుదల

ధర్మవరంరూరల్: నేతన్నలకు, రైతులకు, బడుగుబలహీనవర్గాలకు అండగా ఉంటానని, చేనేతలకు ధర్మవరంలో మెగాటెక్స్‌టైల్స్ పార్కును, రైతుల కోసం సాగునీరు తీసుకువస్తానని సత్యకుమార్ హామీ ఇచ్చారు. ఈ మేరకు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన సత్యకుమార్ సంకల్పపత్రం పేరుతో మేనిఫెస్టో విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు 16అంశాలతో మేనిఫెస్టోను రూపొందించామన్నారు. అధికారంలోకి రాగానే అందులో పొందుపరిచిన అంశాలను తప్పక నెరవేరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

సత్యకుమార్‌ను గెలిపించండి



మాట్లాడుతున్న నారా రోహిత్

ధర్మవరం: కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని సినీ నటుడు నారా రోహిత్ పిలుపునిచ్చారు. నారారోహిత్, మరో నటుడు రఘు శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సత్యకుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం నారారోహిత్ మాట్లాడుతూ.. ధర్మవరం నియోజకవర్గం అభివృద్ధి సత్యకుమార్‌తోనే సాధ్యమన్నారు. కనుక ప్రజలు ఆయన్ను గెలిపించాలని కోరారు.

వంటమాస్టర్ ఆత్మహత్య

ఓబుళదేవరచెరువు, మే 10: మండలంలోని జెర్రికుంటపల్లి గ్రామానికి చెందిన వంట మాస్టర్ కె. ఈశ్వరయ్య (63) ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్ఐ వంశీకృష్ణ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈశ్వరయ్య గత కొన్నేళ్లుగా నారప్పగారిపల్లి క్రాస్‌వద్ద ఓ దాబాలో వంట మాస్టర్‌గా పని చేస్తున్నారు. దాబా బయట ఉన్న బంక్‌లోనే ఒంటరిగా ఉండేవారు. అయితే శుక్రవారం ఆయన అదే బంక్‌లో కడ్డీకి ఉరివేసుకున్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనాస్థలాన్ని జమేదార్ వెంకటేష్ పరిశీలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు,కుమార్తై ఉన్నారు. కుమార్తై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఘనంగా బసవేశ్వర జయంతి

గుడిబండ, మే 10: మండలపరిధిలోని పలారం, కురుబరపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం బసవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వెలసిన బసవేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



గోరంట్లలో పరిశీలిస్తున్న దీపక్ రామచంద్రతవారే

గోరంట్ల, మే 10: మండలంలోని వివిధ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల పరిశీలకుడు దీపక్ రామచంద్రతవారే శుక్రవారం పరిశీలించారు. గోరంట్ల మండలంలోని 70 పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 13న 64,432మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. దీంతో పోలింగ్ కేంద్రాల వద్ద సజావుగా పోలింగ్ సాగడానికి అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. గోరంట్లలోని బాలుర, బాలికల, ఉర్దూ, ఉన్నత పాఠశాలలతో పాటు, గుమ్మయ్యగారిపల్లి, మల్లాపల్లి పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ ఏర్పాట్లపై అధికారులు, బీఎల్ఓలతో సమీక్షించారు. గోరంట్లలోని ఉర్దూ పాఠశాల తాళాలను హెచ్ఎం తనవద్ద ఉంచుకుని అందుబాటులో లేకపోవడాన్ని ఆయన గమనించారు. అక్కడ బారికేడ్లు బయట ఏర్పాటు చేశారు. ఆయన వెంట పెనుకొండ మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, తహసీల్దార్ అక్బల్‌బాషా, ఆర్ఐ సోమశేఖర్‌రెడ్డి, వీఆర్ఓలు అనిల్‌కుమార్, శ్రావణి, లక్ష్మీనారాయణ, బీఎల్ఓలున్నారు.

నేడు కర్ణాటక ఉప ముఖ్యమంత్రి రాక

మడకశిర టౌన్/ రొళ్ల, మే 10: కర్ణాటక రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి డీకే శివకుమార్ శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మడకశిర నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కే సుధాకర్, రొళ్ల మండల కన్వీనర్ గౌడప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన రొళ్ల మండల కేంద్రంలో జరిగే బహిరంగ సభకు హాజరు కానున్నట్లు తెలిపారు. సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డితో పాటు పలువురు కర్ణాటక నేతలు పాల్గొంటారన్నారు. డీకే మధ్యాహ్నం 2గంటలకు రొళ్లకు చేరుకుంటారని తెలిపారు.

ప్రశాంతంగా ఎన్నికలు జరగాలి : డీఎస్పీ



సిబ్బందితో సమావేశమైన డీఎస్పీ

పెనుకొండ టౌన్, మే 10 : ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ బాజీజాన్‌సైద పేర్కొన్నారు. ఆయన శుక్రవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మడకశిర, పెనుకొండ పోలీస్ స్టేషన్‌లకు సంబంధించి సీఐ, ఎస్ఐలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి సమస్యలేమైనా ఉంటే తక్షణం పరిష్కరించుకోవాలన్నారు. ఆయా మండలాల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాల్లో కేసులున్న వారిని హెచ్చరించాలని సూచించా రు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐలు యుగంధర్, సుబ్బరాయుడు, ఎస్ఐలు రాజేష్, వలీబాషా, విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్ల మంజూరు



వీల్‌చైర్లను పంచాయతీ కార్యదర్శులకు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

గోరంట్ల, మే 10: ఈనెల 13న జరగనున్న పోలింగ్ సందర్భంగా మండలంలోని దివ్యాంగులు ఓటు వేయడానికి అనుకూలంగా 40 వీల్ చైర్లు మంజూరైనట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలో 20 పంచాయతీలుండగా పంచాయతీకి ఒక వీల్ చైర్ చొప్పున, గోరంట్ల పట్టణంలో అత్యధికంగా వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నామన్నారు. పోలింగ్ కేంద్రాలవద్ద వాటిని ఏర్పాటుచేస్తామని తెలిపారు. దివ్యాంగులు వచ్చినపుడు వారిని వీల్ చైర్‌లో తీసుకెళ్లి ఓటు వేయిస్తారన్నారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నామన్నారు. వీల్ చైర్లను సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు, శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ ఈఓ బాబురావు, వివిధ పంచాయతీల కార్యదర్శులున్నారు.

యువతి అదృశ్యంపై కేసు

గోరంట్ల, మే 10: పట్టణానికి చెందిన 19ఏళ్ల యువతి శుక్రవారం ఉదయం అదృశ్యమైనట్లు ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ఉదయం 10గంటల సమయంలో కుటుంబ సభ్యులకు చెప్పకుండా యువతి వెళ్లినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గడ్డివామి దహనం

గోరంట్ల, మే 10: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మండలంలోని పెరుమాళ్లపల్లిలో రైతు మహబూబ్‌బాషాకు చెందిన రూ.1.30లక్షల విలువ చేసే వేరుశనగ పొట్టువామి గురువారం రాత్రి దహనమైనట్లు పోలీసులు తెలిపారు. గ్రామ శివారుల్లో పాడి పశువుల మేతకోసం ఆరు ట్రాక్టర్ల వేరుశనగ పొట్టును మహబూబ్‌బాషా వామి వేశాడు. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో వామి పూర్తిగా కాలిపోయింది. మహబూబ్‌బాషా ఈవిషయాన్ని శుక్రవారం గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

టీడీపీ పాలనలోనే పురం అభివృద్ధి

ఎన్నికల ప్రచారంలో నందమూరి బాలకృష్ణ



మరసనపల్లిలో మాట్లాడుతున్న బాలకృష్ణ



కొడికొండలో చిన్నారిని ఎత్తుకున్న దృశ్యం

చిలమత్తూరు, మే 10: అన్ని రకాలుగా వెనుకబడిన హిందూపురం నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టించింది టీడీపీనే అని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆయన శుక్రవారం చిలమత్తూరు మండలంలో రోడ్‌షో నిర్వహించారు. ఉదయం 7 గంటలకే సోమఘట్ట నుంచి ప్రచారాన్ని ప్రారంభించారు. ప్రజలు అడుగడుగునా నీరాజనం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని, వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లు మారిందన్నారు. తాను ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నానన్నారు. వైసీపీ పాలనలో ఒక్కసారి కూడా చెరువుకు నీరు వదల్లేదన్నారు. గత టీడీపీ హయాంలో వేసిన రోడ్లే ఇప్పటికీ ఉన్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వ కల్తీ మద్యంతో అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయన్నారు. ఒక పక్క పథకాల పేరుతో డబ్బులు ఇస్తూనే మరో పక్క లబ్ధిదారులకు తెలియకుండా లాగేస్తున్నారన్నారు. ప్రధానంగా టీడీపీ పేదరిక నిర్మూలనకు ఎన్నో కార్యక్ర మాలు చేపడుతుందన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా పార్థసారథిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అనూష, నాయకులు రంగా రెడ్డి, తిప్పారెడ్డి, సోమశేఖర్, నాగరాజు యాదవ్, బయ పరెడ్డి, లక్ష్మీనారాయణ యాదవ్, బాలాజీ, శ్రీదేవి, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల ద్రోహి జగన్

దళితుల ద్రోహి జగన్మోహనరెడ్డి అని ఎమ్మార్పీస్ నాయకుడు, ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు వైకే విశ్వనాథ్ విమర్శించారు. ఆయన శుక్రవారం మండలంలోని సోమఘట్టలో నందమూరి బాలకృష్ణను కలిసి రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దళితులకు టీడీపీలో జరిగిన న్యాయం, వైసీపీలో జరిగిన అన్యాయంపై కరపత్రాలను బాలకృష్ణ ద్వారా విడుదల చేయించారు. నాయకులు బేకరీ గంగాధర్, మధు, అమర్, ఎస్సీ సెల్ నాయకులు సజ్జప్ప, ఉరుము నంజుండ, నరేష్ తదితరలు ఉన్నారు.



సోమఘట్టలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అడ్డదారుల్లో గెలిచేందుకు వైసీపీ యత్నం

ఎన్నికల ప్రచారంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత



హారతులతో సవితకు స్వాగతం పలుకుతున్న మహిళలు



ప్రజలను ఓటు అభ్యర్థిస్తున్న సవిత

పెనుకొండ టౌన్, మే 10 : అవినీతికి పాల్పడి సంపాదించిన సొమ్ముతో అడ్డగోలుగా ఎన్నికల్లో గెలించేందుకు ప్రయత్నిస్తున్న మంత్రి ఉషశ్రీని చిత్తుగా ఓడించాలని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. ఆమె శుక్రవారం సోమందేపల్లి మండలంలోని కొనతట్టుపల్లి, వెలగమాకులపల్లిల్లో విస్తృతస్థాయి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లను ఆప్యాయంగా పలకరించి ఎంపీ అభ్యర్థి బీకే పార్థ సారథికి, తనకు సైకిల్ గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం సవిత మాట్లాడుతూ... దోచుకోవడంలో కళ్యాణదుర్గంలో అనకొండగా పేరొందిన ఉషశ్రీ ఇక్కడ తిమింగళం అవతారం ఎత్తబోతోందని విమర్శించారు. నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ ఐదేళ్లుగా రాష్ట్రంలో వైసీపీ అరాచక ప్రభుత్వం ప్రజలను ఎన్నోరకాలుగా ఇబ్బందులకు, అవస్థలకు గురిచేసిందని ఆమె పేర్కొన్నారు. భారత రాజ్యాంగం ప్రజలకు ప్రసాదించిన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను సీఎం జగన్ పూర్తిగా హరించవేశారని మండి పడ్డారు. అందుకే ఈ అరాచక ప్రభుత్వాన్ని ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో సాగనంపాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఐదేళ్ల రాష్ట్ర వ్యాప్తంగా ఎంతోమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు తమ జీవితాలను త్యాగంచేసి, ప్రాణాలను పణంగా పెట్టి అరాచక ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడారన్నారు. అటువంటి కార్యకర్తలను మరిచే ప్రసక్తే లేదన్నారు. ముఖ్యమంత్రి అంటే కేవలం బటన్ నొక్కడమే కాదు కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవాలన్నారు. నియోజకవర్గంలో టీడీపీ మెజార్టీ భారీ స్థాయిలో ఉండేలా ఓటు వేయాలని కోరారు.



వచ్చే నెల నుంచి రూ.4వేలు పింఛన్ అంటున్న సవిత

రొద్దం : మండలపరిధిలోని తురకలాపట్నానికి చెందిన సింగిల్‌విండో సొసైటీ అధ్యక్షుడు కేపీ శ్రీనివాసులు శుక్రవారం టీడీపీలో చేరారు. పెనుకొండలోని టీడీపీ కార్యాలయంలో ఆయనకు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. చంద్రబాబు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు చూసి పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు. అలాగే అదే గ్రామాని కి చెందిన వైసీపీ కార్యకర్త శివ, నల్లూరుకు చెందిన వైసీపీ నాయకుడు ఓబులేసు టీడీపీలో చేరారు.



శ్రీనివాసులును టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సవిత

భూములకు రక్షణ లేకుండా చేసిన జగన్

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు



ప్రచారంలో మాట్లాడుతున్న ఎంఎస్ రాజు



టీడీపీకి మద్దతుగా తరలివచ్చిన మహిళలు

మడకశిర టౌన్, మే 10: ముఖ్యమంత్రి జగన్ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తెచ్చి ప్రజల భూములకు రక్షణ లేకుండా చేశారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు విమర్శించారు. ఓటు ద్వారా జగన్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం అమరాపురం మండలంలోని వలస, తమ్మడేపల్లి, హలుకూరు, గౌడనకుంట గ్రామాల్లో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త గుండుమల తిప్పేస్వామితో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏ గ్రామానికి వెళ్లినా మహిళలు హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసే బాధ్యత తనదన్నారు. వక్క రైతులకు స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని, రాష్ట్రాభివృద్ధి ఇరవై ఏళ్ల వెనక్కి వెళ్లిందన్నారు. ఈ ఐదేళ్లలో నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ శాశ్వత అభివృద్ధి పని ఏదీ లేదన్నారు. టీడీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో ఆగిపోయిన పది శాతం పూర్తి చేయలేక పోయారని విమర్శించారు. జగన్ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పెత్తందారుల చేతిలో కీలు బొమ్మని, అందరూ కలసి సిండికెట్‌గా ఏర్పడి తెచ్చుకున్న ఆయనకు అధికారం ఇస్తే భవిష్యత్తు ఎలా ఉంటుందో ఆలోచించాలన్నారు. ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా పార్థసారథిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, ఎస్సీ సెల్ ఆర్ జయకుమార్, నాయకులు గణేష్, ఉగ్రనరసింహప్ప, శివరుద్రప్ప, క్రిష్ణమూర్తి, మాజీ సర్పంచ్ విశ్వనాథ్, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిర రూరల్: మండలంలోని గౌడనహళ్లి పంచాయతీ గ్రామాల్లో శుక్రవారం టీడీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి సతీమణి బీకే కమలమ్మ, మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు సతీమణి ఎంఎస్ ఉమాదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారికి స్థానిక నాయకులు పూలమాలలతో, మహిళలు హారతులతో స్వాగతం పలికారు. వారు ప్రతి ఇంటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గుర్చి వివరించారు. రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబునాయుడుతోనే సాధ్యమన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం చేస్తున్న కమలమ్మ, ఉమాదేవి

మైనార్టీలపై వైసీపీది కపట ప్రేమ

మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్



సంతేబిదునూరులో మైనార్టీలతో సమావేశమైన ఇక్బాల్

హిందూపురం, మే 10 : మైనార్టీల పై వైసీపీ కపట ప్రేమ చూపుతోం దని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ నాయకుడు షేక్ మహ్మద్ ఇక్బాల్‌అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శుక్రవారం హిందూపురానికి వచ్చారు. ఈ సందర్భంగా చిలమత్తూరు మండలం కొడికొండ వైసీపీ ఎంపీటీసీ ఇర్షాద్‌బేగం, షఫీ ఇక్బాల్ సమక్షంలో టీడీపీలో చేరారు. వీరిని పార్టీ కండువావేసి ఆహ్వానించారు. అలాగే పట్టణంలోని 25వ వార్డు వైసీపీ ఇన్‌చార్జ్ కార్తీక్ ఇక్బాల్ సమక్షంలో టీడీపీలో చేరారు. అదేవిధంగా సంతేబిదునూరు లో ఆయన మైనార్టీల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రవేశపెట్టే బిల్లులన్నింటికి సీఎం జగన్ ఆమోదం తెలుపుతూ రాష్ట్రంలో బీజేపీని విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఓటుకోసం తన స్వార్థం కోసం బీజేపీ ని విమర్శిస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే మైనా ర్టీలకు రక్షణ ఉండాలంటే కేంద్రంలో ఎన్‌డీఏ, రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ అనీల్‌కుమార్, సంతేబిదునూరు శ్రీరాములు, ఆంజనేయులు, డా.బాష, తదితరులు పాల్గొన్నారు.

ముందుచూపున్న నేత చంద్రబాబు

సినీనటుడు సప్తగిరి



అమరాపురం రోడ్‌షోలో పాల్గొన్న సప్తగిరి

మడకశిర టౌన్, మే 10: నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు లాంటి సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవాలని సినీనటుడు సప్తగిరి అన్నారు. ఆయన శుక్రవారం రాత్రి అమరాపురం మండల కేంద్రంలో టీ డీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు, నియోజకవర్గ సమన్వయకర్త గుండుమల తిప్పేస్వామితో కలసి రోడ్‌షోలో పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై ముందు చూపున్న నేత చంద్రబాబు అని రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, వెనకబడిన ప్రాంతమైన మడకశిర అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే సైకిల్ గుర్తుకు ఓటు వేసి టీడీపీ అభ్యర్థులను ఆశీర్వదించాలన్నారు. సమస్యలపై పోరాడే తత్వం ఉన్న వ్యక్తి ఎంఎస్ రాజు అన్నారు. విజన్ ఉన్న చంద్రబాబులాంటి నేతను రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేసుకోవడం వల్ల రాష్ట్ర భవిష్యత్తుకు బాటలు వేస్తారని, యువతకు పరిశ్రమల ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తారన్నారు. గత టీడీపీ హయాంలో రాష్ట్రంలో అనేక పరిశ్రమలు తెచ్చి ఉపాధి కల్పించిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. ఈనెల 13న పోలింగ్‌లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి, ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు, ఎంపీ అభ్యర్థి పార్థసారథిని అత్యధిక మెజారిటీతో గెలిపించి ఈ ప్రాంత అభివృద్ధికి మీరే బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం మత్తులో గ్రామాలు



మడకశిర రూరల్, మే 10: ప్రస్తుతం ఎన్నిల సమయంలో మండలంలోని గ్రామాలు మద్యం మత్తులో తూగుతున్నాయి. ఈ మద్యం మత్తులో కొన్ని గ్రామాల్లో ఘర్షణలు కూడా చోటుచేసుకుంటున్నాయి. కర్ణాటక మద్యం గ్రామాల్లో ఏరులైపారుతోందని మండలంలోని గ్రామాల ప్రజలు వాపోతున్నారు. సెబ్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు సరియైన నిఘా ఉంచడం లేదనే ఆరోపణలు ప్రజల నుంచి వస్తున్నాయి. అసలే ఎన్నికల సమయం విచ్చలవిడిగా కర్ణాటక మద్యం గ్రామాల్లోకి వస్తుండ డంతో... దానిని తాగి కొంతమంది అనవసరమైన గొడవలకు దిగుతున్నారని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో గ్రామాల్లో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని అంటున్నారు. ఎన్నిల ప్రచారం అంటే మందుబాబులు ముందు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గట్టి నిఘా ఉంచి కర్ణాటక మద్యం అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సరిహద్దులో నిఘా పెంచుతాం

సరిహద్దు గ్రామాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం రవాణా కాకుండా గట్టి నిఘా ఉంచాం. మడకశిర ప్రాంతం ఎక్కువ భాగం కర్ణాటక సరిహద్దులో ఉంది. దీంతో ఎంత నిఘా ఉంచినా ఇబ్బందులు తప్పడం లేదు. అక్రమంగా మద్యం రాకుండా మరింత నిఘా పెంచుతాం.

- ధీరజ్‌రెడ్డి, సెబ్ సీఐ, మడకశిర

జేఎన్‌టీయూ బీటెక్ ఫలితాల విడుదల

అనంతపురం సెంట్రల్, మే 10: జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ నాలుగో సంవత్సరం విద్యార్థుల పరీక్షా ఫలితాలను ప్రిన్సిపాల్ సత్యనారాయణ తన కార్యాలయంలో శుక్రవారం విడుదల చేశారు. ఈ నెల మూడో తేదీ వరకు ద్వితీయ సెమిస్టర్ (ఆర్ 20) రెగ్యులర్ పరీక్షలను నిర్వహించామని, వారం లోగా మూల్యాంకనం చేయించి ఫలితాలను విడుదల చేశామని ఆయన తెలిపారు. విద్యార్థులు తమ ఫలితాల కోసం కళాశాల అకడమిక్ సెక్షన్‌ను సంప్రదించాలన్నారు. అయితే ఫలితాల కోసం అకడమిక్ సెక్షన్‌కు వెళ్లిన విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజులు మొత్తం పూర్తిగా చెల్లిస్తేనే ఫలితాలు చూపిస్తామని, సర్టిఫికెట్లు ఇస్తామని కళాశాల యాజమాన్యం చెబుతుండటంతో వారు అయోమయంలో పడ్డారు. ప్రభుత్వం ఫీజు మొత్తాన్ని విడుదల చేయకుంటే తామెలా కట్టాలని తల్లిదండ్రులు వాపోతున్నా... ఫీజు కట్టాల్సిందేనని కళాశాల యాజమాన్యం పట్టుపడుతోంది.

నియంత పాలనకు బుద్ధి చెబుదాం

రాష్ట్ర గిరిజన నాయకులు

పెనుకొండ రూరల్, మే 10: రాష్ట్రంలో నియంత పాలన సాగుతోందని ఓటుతోనే వైసీపీకి బుద్ధిచెబుదామని రాష్ట్ర గిరిజన నాయకులు, టీడీపీ నాయకులు రంజిత్‌నాయక్, అంజేనాయక్ గిరిజనులకు పిలుపునిచ్చారు. వారు శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2014 నుంచి 2019వరకు టీడీపీ హయాంలో చంద్రబాబు నా యుడు గిరిజనులకు సంక్షేమ పథకాలు, విదేశీ విద్య అందిం చేవారన్నారు. వైసీపీ పాలనలో గిరిజనులకు అందాల్సిన 17 సంక్షేమ పథకాలను జగన్మోహన్‌రెడ్డి రద్దుచేసి గిరిజనులను ఆర్థికంగా దెబ్బతీశారన్నారు. రాష్ట్రంలో ఉన్న గిరిజనులంతా వైసీ పీ ప్రభుత్వాన్ని సాగనంపాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, ఎంపీ అభ్యర్థి పార్థసారథికి ఓటేసి అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో హరిలాల్‌నాయక్, రాజునాయక్, రవినాయక్, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైసీపీ

ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్

గోరంట్ల, మే 10: వైసీపీ ప్రభుత్వం మాదిగల పట్ల వ్యతిరేకతతో, నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మహాజన్ సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వైకె విశ్వనాథ్‌మాదిగ విమర్శించారు. మాదిగలను రాజకీయంగా, ఆర్థికకంగాల్లో అణిచివేస్తూ సీఎం జగన్మోహన్‌రెడ్డి మాదిగల పోరాటాన్ని పరిగణించలేదన్నారు. గోరంట్ల పర్యటన సందర్భంగా ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ కరపత్రాలను విడుదల చేశారు. మందక్రిష్ణమాదిగ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా మాదిగలను, అన్నివర్గాలవారిని చైతన్య పరుస్తూ ఎన్‌డీఏ కూటమి గెలుపుకోసం కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీవర్గీకరణ పట్ల ప్రధానిమోదీ సానుకూలంగా ఉన్నారని రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నామన్నారు. ఎంఎస్‌పీ ఉమ్మడి అనంతపురం కన్వీనర్ సామ్రాట్ మధుమాదిగ, ఎమ్మార్పీఎస్ సైకిల్ నరసింహులు, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప తదితరులున్నారు.

టీడీపీ నాయకుల ఇంటింటి ప్రచారం

రొళ్ల, మే 10 : ఈనెల 13న జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు, పార్లమెంట్ అభ్యర్థి బీకే పార్థసారథిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర వక్కళిగ సాధికారిక కన్వీనర్ వీఎం పాండురంగప్ప కోరారు. ఆయన శుక్రవారం మండలంలోని మల్లినమడుగు పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దాసిరెడ్డి, పంచాయతీ కన్వీనర్ నారాయణప్ప, ఈరణ్ణ, సిద్దగంగప్ప, రాజన్న, శ్రీరంగప్ప, బీజేపీ నాయకుడు ముద్రాజ్ తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : ఈ సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ లక్ష్మీనరసప్ప కోరారు. ఆయన శుక్రవారం మండల పరిధిలోని ముదుకూరు పంచాయతీలో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రకాశ్, షబ్బీర్, సిద్దేశ్వరప్ప, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేటి ఎన్నికల ప్రచారం

మడకశిర టౌన్: నియోజకవర్గంలోని అగళి, మడకశిర మండలాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు టీడీపీ నియోజకవర్గం సమన్వయ కర్త గుండుమల తిప్పేస్వామి శుక్రవారం తెలిపారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజుతో కలసి ఉదయం 10 గంటలకు మడకశిర మండలంలోని కే గుండుమల గ్రామంలో, 11గంటలకు అగళి లో రోడ్‌షో నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు రామాపురంలో, 3గంటలకు మడకశిర పట్టణంలో రోడ్‌షో నిర్వహించనున్నట్లు తెలిపారు.

తేలికపాటి వర్షానికే రోడ్డుపై నీరు



నారాయణమ్మకాలనీలో రోడ్డుపై గుంతల్లో చేరిన వర్షపునీరు

పెనుకొండ రూరల్, మే 10 : ఐదేళ్ల నుంచి వైసీపీ నాయకులు పెనుకొండలోని నారాయణమ్మ కాలనీ మీదుగా కోనాపురం, మంగాపురం వెళ్లే రహదారికి రూ.2కోట్లతో నిధులు మంజూరయ్యాయని కల్లిబొల్లి మాటలు చెప్పి కాలం గడిపారని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఐదేళ్లుగా గుంతలుపడ్డ రోడ్డులో ప్రయాణానికి నానా అవస్థలు పడుతున్నట్లు వాపోయారు. ఈ రహదారిలో ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన సంఘటనలు ఉన్నాయని కోనాపురం, మంగాపురం వాహన దారులు వాపోతున్నారు. పెనుకొండ నుంచి కోనాపురం, మంగాపురం తదితర గ్రామాలకు ఈ రహదారిలో ఆటోలో ప్రయాణించాలంటే నరకయాతన అనుభవిస్తున్నామ న్నారు. శుక్రవారం కురిసిన తేలికపాటి వర్షానికి ఆ రోడ్డు లోని గుంతల్లో వర్షంనీరు చేరి తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మన్నారు. ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో బుద్ధి చెబుతామని మండిపడ్డారు.

వైసీపీ నాయకుల ఘర్షణపై కేసులు

గోరంట్ల, మే 10: పట్టణంలోని శివాలయం ప్రాంతానికి చెందిన మాజీ వలంటీర్ శశిభూషణ్, వినాయక్ నగర్‌కు చెందిన వైసీపీ నాయకుడు వడ్డె రామక్రిష్ణ మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి, ఇరువర్గాల ఫిర్యాదు మేరకు శుక్ర వారం కేసులు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఓటర్ స్లిప్పుల పంపిణీ విషయంలో శశిభూషణ్ వార్డు సభ్యురాలు సరస్వతి భర్త రామక్రిష్ణతో గురువారం పాత స్టేట్‌బ్యాంక్ వీధిలో ఘర్షణపడిన విషయం తెలిసిందే. వారిద్దరు రోడ్డు పైన ఘర్షణపడి కొట్టుకున్నారు. దీంతో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.